
తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
మంగళవారం
23, జూన్, 2026



# మహిళలు, చిన్నారుల రక్షణకు మరో ముందడుగు

**- నాగర్‌కర్నూల్‌లో భరోసా సెంటర్‌కు శంకుస్థాపన చేసిన మంత్రి సీతక్క**







**నాగర్ కర్నూల్, జూన్ 22 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేయనున్న భరోసా సెంటర్‌కు పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ(సీతక్క)శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ, డీ ఐ జీ డాక్టర్ ఎల్ ఎస్ చౌహాన్, ఎస్పీ సంగ్రామ్‌సింగ్ జి పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మహిళలు, చిన్నారులకు రక్షణ, న్యాయ సహాయం, కౌన్సెలింగ్ సేవలు ఒకే చోట అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం భరోసా సెంటర్లను ఏర్పాటు చేస్తోందన్నారు. బాధితులకు తక్షణ సహాయం అందించడంతో పాటు, వారికి అవసరమైన వైద్య, న్యాయ, మానసిక పరమైన సేవలను సమన్వయంతో అందించడంలో భరోసా సెంటర్లు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. మహిళల భద్రత, సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, సమాజంలో మహిళలు, చిన్నారులు ధైర్యంగా జీవించే వాతావరణాన్ని కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని నాయకులు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్, టౌన్ ప్రెసిడెంట్ జక్క రాజుకుమార్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్స్, ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# ప్రతి కుటుంబానికి పక్కా భవనం కలిగి ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

**- పూరి గుడిసెలు ఉన్న ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో తొలి ప్రాధాన్యం**
**- బేస్‌మెంట్ కట్టుకొని ఉన్న, గోడలు మంచిగా ఉండి పై కప్పు రేకులు, కవెలలు ఉన్నవారికి కూడా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు**
**- వనపర్తి జిల్లాలో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అమలుపై ప్రత్యేక అధికారి సమీక్ష**
**- జిల్లాలో ప్రజాపాలన అమలు చేసిన తీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన ప్రత్యేక అధికారి తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండి వీపీ గౌతమ్**



**వనపర్తి బ్యూరో, జూన్ 22 (జనంసాక్షి):** రాష్ట్రంలో పూరి గుడిసెలు కాకుండా ప్రతి కుటుంబానికి పక్కా భవనం కలిగి ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, పూరి గుడిసెలు ఉన్న ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రత్యేక అధికారి వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు.తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక ప్రత్యేక అధికారి వీపీ గౌతమ్ సోమవారం వనపర్తి జిల్లాను సందర్శించారు.ఈ సందర్భంగా ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి జిల్లా అధికారులతో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశం లో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి జిల్లాలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కింద చేపట్టిన కార్యక్రమాలను ప్రత్యేక అధికారికి వివరించారు. 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా నిర్వహించిన పరిశుభ్రత కార్యక్రమాలు, "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత కార్యక్రమాలు, ఆరోగ్య వారోత్సవాలు, టీబీ మిషన్, తదితర అంశాలపై వివరించారు.ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి వీపీ గౌతమ్ మాట్లాడుతూ "అరైవ్ అలైవ్" కార్యక్రమం ప్రాధాన్యతను వివరిస్తూ.. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్, సీటుబెల్ట్ ధరించాలని సూచించారు. జిల్లాలో రోడ్డు భద్రతా నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో రహదారులపై బ్లాక్ స్పాట్స్ గుర్తించి రక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్కు సూచించారు. విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో కొత్త అడ్మిషన్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో గ్యాస్ కనెక్షన్ల వినియోగాన్ని నిర్ధారించాలని ఆదేశించారు. పంటల మార్పిడి అంశంపై మాట్లాడుతూ రైతులు సంప్రదాయ పంటలతో పాటు ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.

*మిగతా 12లో..*

# మహబూబ్‌నగర్ బడిపిల్లల

# కథల సంకలనాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**మహబూబ్‌నగర్ రూరల్ జూన్ 22 (జనంసాక్షి):** మహబూబ్‌నగర్ జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు రాసిన "మహబూబ్‌నగర్ జిల్లా బడిపిల్లల కథలు" కథల సంకలన పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సోమవారం కలెక్టరేట్‌లో ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు రాసిన కథలు ఎంతో చక్కగా, ఆలోచింపజేసేలా ఉన్నాయని అభినందించారు. చిన్నారుల్లో దాగివున్న సృజనాత్మక నైపుణ్యాలను, ఆలోచనలను బయటకు తీయడానికి ఇలాంటి పుస్తక రచనలు ఎంతగానో దోహదపడతాయని ఆమె పేర్కొన్నారు.జిల్లా విద్యాశాఖాధికారి విజయకుమారి మాట్లాడుతూ, పాఠశాల విద్యార్థుల నిజజీవిత అనుభవాలు, వారి అమాయకపు ఆలోచనల కలయికతో ఈ పుస్తకం రూపుదిద్దుకుందని తెలిపారు. ఈ కథలు ఇతర చిన్నారుల్లో కూడా పఠనాసక్తిని పెంపొందిస్తాయని చెప్పారు. జిల్లాలోని ఉపాధ్యాయులందరూ చొరవ తీసుకుని విద్యార్థులను ప్రోత్సహిస్తే వారిలోని అద్భుత నైపుణ్యాలు వెలుగులోకి వస్తాయని, కలెక్టర్ గారి ప్రత్యేక సహాయ సహకారాల వల్లే ఈ పుస్తకం వెలుగు చూసిందని ఆమె కృతజ్ఞతలు తెలిపారు.




ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ హరిప్రియ, జెడ్పీ సి.ఇ.ఓ. వెంకట్ రెడ్డి, ఎ.ఓ. సువర్ణ రాజ్, వ్యవసాయ శాఖ ట్రేనింగ్ సెంటర్ డి.డి. వేంకటేశ్, ఎ.ఎం.ఓ. దుంకుడు శ్రీనివాస్, సి.ఎం.ఓ. సుధాకర్ రెడ్డి, జి.సి.డి.ఓ. అస్రాఖాద్రి, పుస్తక సంపాదకులు డా. భీంపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మత్తు వదలండి... మైదానాలు చేరండి

**- రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి**



**మహబూబ్ నగర్ ప్రతినిధి జూన్ 22 (జనంసాక్షి):** మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో 12కోట్ల 53 లక్షల రూల వ్యయంతో చేపట్టనున్న క్రీడా మౌలిక సదుపాయాల పనులకు ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి తో కలిసి శంకుస్థాపన చేసిన మంత్రి వాకిటి శ్రీహరి మత్తు వదలండి... మైదానాలు చేరండి అని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ, పాడి పరిశ్రమాభివృద్ధి,మత్స్య,క్రీడలు,యువజన సర్వీసుల శాఖా మంత్రి వాకిటి శ్రీహరి యువతకు పిలుపునిచ్చారు. సోమవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ఇండోర్ స్టేడియం గ్రౌండ్ మైదానంలో తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో 12.53 కోట్ల రూపాయలతో(10.70 కోట్ల రూ.లతో అథ్లెటిక్ సింథటిక్ ట్రాక్, ఒక కోటి రూ.లతో నాలుగు ఓపెన్ జిమ్స్,51 లక్షల రూ.లతో ఇండోర్ జిమ్, మహిళల అథ్లెటిక్స్ హాస్టల్ మిగిలిన పనులకు 32 లక్షల రూ.లు) వ్యయంతో పలు ఆధునిక క్రీడా సదుపాయాల నిర్మాణానికి ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ మహబూబ్ నగర్ జిల్లా కు చెందిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి క్రీడలకు అత్యంత ప్రాధాన్యత నిస్తూ క్రీడా కారులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నారని తెలిపారు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించనున్న 400 మీటర్ల 8 లైన్ల సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ ద్వారా జిల్లాలోని యువ క్రీడాకారులకు ఉన్నత స్థాయి శిక్షణ అందే అవకాశం కలుగుతుందని అన్నారు క్రీడలు కేవలం వినోదం మాత్రమే కాకుండా జీవన శైలిని మార్చే శక్తివంతమైన సాధనం అని ఆయన అన్నారు. ప్రతి యువకుడు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలి అని అన్నారు.ఉమ్మడి పాలమూరు జిల్లాలో వివిధ నియోజకవర్గం లలో ఇప్పటికే సుమారు 80 కోట్ల రూపాయల నిధులు కేటాయించినట్లు తెలిపారు. క్రీడా రంగ అభివృద్ధి కోసం అవసరమైతే వంద కోట్ల రూపాయల వరకు ఖర్చు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. యువత టైమ్‌పాస్‌గా కాకుండా క్రీడలను సీరియస్‌గా తీసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు క్రీడాకారులను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లాలో స్విమ్మింగ్ ఫూల్ ను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలోనే నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. స్పోర్ట్స్ అసోసియేషన్లు మరింత చురుకుగా పనిచేసి గ్రామ స్థాయి నుండి యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలని సూచించారు. క్రీడా ప్రాజెక్టులకు గ్రీన్ ఛానల్ ద్వారా త్వరితగతిన అనుమతులు ఇచ్చి పనులను వేగవంతం చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. లక్షలాది యువతకు క్రీడల ద్వారా అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ప్రభుత్వ విప్,మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మంత్రి వాకిటి శ్రీహరి క్రీడాశాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలి సంతకం చేసి మహబూబ్ నగర్ కు మంజూరు చేసిన ప్రాజెక్టుకు ఈరోజు శంకుస్థాపన చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. నాడు అడిగిన వెంటనే స్పందించి నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. జిల్లాలో క్రీడల అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. వాలీబాల్, కబడ్డీ అకాడమీతో పాటు క్రికెట్ స్టేడియం నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

*మిగతా 12లో..*

# ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలి

**- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



**సంగారెడ్డి, జూన్ 22 (జనంసాక్షి):** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందుతున్న ప్రతి ఫిర్యాదును సత్వరంగా, పారదర్శకంగా పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా నిర్ణీత గడువులోపు చర్యలు పూర్తి చేయాలని సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండులతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల వివరాలను తెలుసుకుని సంబంధిత శాఖల జిల్లా అధికారులకు వినతులను పంపిస్తూ తగిన సూచనలు జారీ చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రజావాణిలో మహిళా మరియు శిశు, వికలాంగులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, వ్యవసాయ శాఖ, గృహ నిర్మాణ శాఖ, పంచాయతీరాజ్ శాఖ, మున్సిపల్ శాఖ, కార్మిక శాఖ, కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ), వైద్య ఆరోగ్య శాఖ, ఇంటర్మీడియట్, వైద్య ఆరోగ్య, విద్యాశాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, బీసీ సంక్షేమ శాఖ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, రెవెన్యూ శాఖ, డీఆర్‌డీఓ తదితర శాఖలకు సంబంధించిన వినతులు అందాయి. జిల్లాలో డివిజన్ వారీగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 57 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు.

వాటిలో జిల్లా కలెక్టరేట్‌లో 34, సంగారెడ్డి డివిజన్‌లో 12, ఆందోల్ డివిజన్‌లో 0, నారాయణఖేడ్ డివిజన్‌లో 1, జహీరాబాద్ డివిజన్‌లో 10 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశం

**- మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్**



**మెదక్ జూన్ 22 (జనంసాక్షి):** ఈ సందర్భంగా మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక రాష్ట్ర నాయకులు మైనంపల్లి హన్మంతరావు పై కేటీఆర్ బ్యాచ్ గ్లోబల్ ప్రచారం చేస్తుందని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తు మీలా కమిషన్లు తీసుకొని,బ్రోకర్ బ్రోకర్ వ్యవహారం కాంగ్రెస్ పార్టీ నేతలకు రాదని అన్నారు.

మెదక్లో ధాన్యం కొనుగోళ్లు చేయడం లేదని ఆరోపించడం సరి కాదు అన్నారు. జిల్లాలో ఎన్నడూ లేని విధంగా ఈ యాసంగిలో 4.18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చిందని, రికార్డు స్థాయిలో ధాన్యం రావడం వల్ల కొంత ఆలస్యం అయిందన్నారు. రైతుల సమస్య కోసం కాంగ్రెస్ పార్టీయే ముందుగా ధర్నా చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పటి వరకు 90 శాతం మంది రైతులకు ధాన్యం డబ్బులు ఖాతాల్లో జమ చేసినట్టు చెప్పారు. ఇప్పటి వరకు మెదక్లో వెయ్యి కోట్ల అభివృద్ధి జరిగిందని, కావాలంటే నిధుల వివరాలు బిఆర్ఎస్ నేతలకు పంపిస్తామని చెప్పారు.

గతంలో వారి పాలనలో జరిగినట్టు ఇసుక అమ్మకోలేదని, మెదక్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు తరలిపోలేదన్నారు. అప్పుడు మీరు మీ షాడో ఎమ్మెల్యే ఏమి చేశారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే టిక్కెట్ పరేషాన్ వల్ల ఆమె మాట్లాడుతుందని ఎద్దేవా చేశారు. వర్షాకాలంలో ప్రాణాలకు తెగించి వరదల్లో చిక్కుకున్న వారిని మా నేత దగ్గర ఉంది కాపాడదని, తమంత వెంటే ఉన్నామన్నారు. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెదక్ వచ్చి రివ్యూ చేసిన విషయం బీఆర్ఎస్ నేతలు మరచి పోయినట్లు ఉన్నారని, అందుకే వరదలు వచ్చిన పట్టించుకోనట్లు మాట్లాడుతున్నారని అన్నారు. ప్రభుత్వం కార్యాలయాలు తరలిపోతుంటే చేతులు ముడుచుకు కూర్చున్న మీరు ఇప్పుడు అభివృద్ధి లేదని ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మెదక్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, చర్చకు రావాలని పిలుపునిచ్చారు. మెదక్లో జరిగిన అభివృద్ధి వివరాలు బీఆర్ఎస్ నేతలకు పంపిస్తామని, అప్పుడే జరిగిన అభివృద్ధి తెలుస్తుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ నరేశ్ గౌడ్,మెదక్ పట్టణ అధ్యక్షులు గంగాధర్, మాజీ చైర్మన్ రాగి అశోక్, హఫీజ్, నాగరాజు, రమేష్, మహిపాల్ రెడ్డి, శ్రీకాంత్, తాహెర్, విశ్వం, హవేలి ఘనపూర్ మండల అధ్యక్షుడు కిరణ్ గౌడ్, రాజశేఖర్, కౌన్సిలర్, కార్యకర్తలు పాల్గొనారు.

# వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ఫీజుల్లో రాయితీ

**- టియుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షులు మాధవరావు**
**- ప్రొసీడింగ్స్‌ను జారీ చేసిన డీఈఓ కార్యాలయం**



**శ్రీరంగాపూర్, జూన్ 22 (జనంసాక్షి):** ప్రైవేటు విద్యాసంస్థల యజమాన్యం జర్నలిస్టుల పిల్లల ఉచిత విద్యకు సహకరించండి. గత పదేళ్లుగా జర్నలిస్టుల పిల్లలకు విద్యాభారం తగ్గించేందుకు యూనియన్ కృషి చేస్తోందనీ టీయూడబ్ల్యూజే (ఐజేయు) వనపర్తి జిల్లా అధ్యక్షులు మాధవరావు స్పష్టం చేశారు. జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు రాయితీలు కల్పిస్తూ సోమవారం విద్యాశాఖ ప్రొసీడింగ్స్ జారీ చేసింది. ఈ మేరకు సోమవారం జిల్లా విద్యాశాఖ ఏవో చేతుల మీదుగా ఉచిత విద్య ప్రొసీడింగ్స్ ప్రతులను టియుడబ్ల్యూజే (ఐజేయు) యూనియన్ జిల్లా అధ్యక్షులు డి. మాధవరావు కు అందజేశారు. 2026-28 విద్యా సంవత్సరానికి గాను జిల్లా కలెక్టర్ జారీ చేసిన అక్రిడిటేషన్ కార్డులు కలిగిన జర్నలిస్టుల పిల్లలకు ఒకరికి పూర్తిగా ఉచిత విద్య, రెండో బిడ్డకు 50 శాతం ఫీజు రాయితీతో విద్య అందించాలని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు సూచించారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు మాధవరావు మాట్లాడుతూ, గత పదేళ్లుగా జర్నలిస్టుల పిల్లలకు విద్యాభారం తగ్గించేందుకు యూనియన్ కృషి చేస్తోందన్నారు. వారి ప్రతిపాదన మేరకు ప్రతి ఏడాది విద్యాశాఖ అధికారులు ఒక విద్యార్థికి పూర్తి ఫీజు మినహాయింపు, మరో విద్యార్థికి 50 శాతం ఫీజు రాయితీ కల్పించేలా సర్క్యులర్ జారీ చేస్తున్నట్లు తెలిపారు. సమాజానికి సమాచారాన్ని అందించడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారి కుటుంబాలు అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు ఈ రాయితీలను అమలు చేసి జర్నలిస్టుల కుటుంబాలకు సహకరించాలని కోరారు. ఈ నిర్ణయం జర్నలిస్టుల పిల్లల విద్యాభారాన్ని తగ్గించడంలో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ లు పాల్గొన్నారు.

# కాళ్లకల్‌లో ప్రీ ప్రైమరీ పాఠశాలను ప్రారంభించిన సర్పంచ్

**- విద్యారంగానికి పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం**
**- తల్లిదండ్రులు ప్రభుత్వ బడులను మాత్రమే ప్రోత్సహించాలి**



**మనోరహాబాద్, జూన్23 (జనంసాక్షి):** మనోహరాబాద్ మండల పరిధిలోని కల్లకాల్ గ్రామంలో ప్రభుత్వ ప్రీ ప్రైమరీ పాఠశాలను సోమవారం ప్రారంభించిన సర్పంచ్ నవ్య నాగరాజు ఉన్నత పాఠశాల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరికృష్ణ శ్రీనివాసలతో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యారంగానికి పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం మరెన్నో సంక్షేమ పథకాలతో అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తల్లిదండ్రులు ప్రభుత్వ బడులను మాత్రమే ప్రోత్సహించాలని కోరారు. పిల్లల చదువులతో తల్లిదండ్రులకు ఆర్థికభారం కాకూడదు బడి పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఎంతైనా ఉంది ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది పాలకవర్గ సభ్యులు విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం



**శివ్వంపేట, జూన్22 (జనంసాక్షి):** అంగన్వాడీ కేంద్రాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని శివంపేట సర్పంచ్ రాజీపేట వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన శివ్వంపేట లోని అంగన్వాడి కేంద్రంలో సోమవారం స్థానిక సర్పంచ్ రాజీపేట వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో అంగన్వాడి చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారి విద్యార్థులకు సర్పంచ్, ఐసిడిఎస్ అధికారులు యూనిఫామ్ బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సుపర్ వైజర్ సంతోష అంగన్వాడి టీచర్ నవీన, మాజీ వార్డు సభ్యులు బాసంపల్లి పోచ గౌడ్, వంజరి కొండల్,వెంకటేష్, దొడ్ల అశోక్, బిస్కుంద్ ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

# తెలంగాణ రక్షణ సేనలో చేరనున్న నెమలికొండ వేణుమాధవ్



**సదాశివపేట, జూన్22 (జనంసాక్షి):** బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు నెమలికొండ వేణుమాధవ్ ఈ నెల 24వ తేదీ బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన ప్రధాన కార్యాలయంలో పార్టీ అధ్యక్షురాలు కవిత సమక్షంలో తెలంగాణ రక్షణ సేన (TRS) పార్టీలో చేరనున్నారు. సంగారెడ్డి జిల్లాకు చెందిన వేణుమాధవ్ చేరికతో భవిష్యత్ లో భారీగా జిల్లా రాజకీయ సమీకరణాలు మారనున్నట్టు పలువురు భావిస్తున్నారు.

# ఆర్డీవోకు RRR భూ నిర్వాసితుల వినతి



**నర్సాపూర్, జూన్ 22 (జనంసాక్షి):** రీజినల్ రింగ్‌రోడ్‌లో భాగంగా తుజాల్పూర్ ,తిరుమలపూర్ రైతులు సోమవారం నష్టపరిహారం చెల్లించాలంటూ ఆర్డిఓ రామకృష్ణకు వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమ వ్యవసాయ భూమిని ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి ప్రభుత్వం సేకరించిందని వెల్లడించారు. 70 సంవత్సరాల నుండి వ్యవసాయం చేసుకుంటూ భూములు అటవీ భూములుగా సాకులు చెబుతూ నష్టపరిహారం చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ భూమిపైన గతంలో ప్రభుత్వ పథకాలు లోన్లు పొందడం జరిగిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోల్పోయిన భూమిని నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

ఈ సందర్భంగా ఆర్డీవో రామకృష్ణ మాట్లాడుతూ ఈ భూమి గురించి కలెక్టర్ కు నివేదిక పంపించడం జరిగిందన్నారు. జాయింట్ సర్వే నిర్వహించి రైతులకు నష్టపరిహారం జరిగేలా చేస్తామన్నారు. పై అధికారుల నుండి నివేదిక రాగానే ఫారెస్ట్ రెవెన్యూ డిపార్ట్మెంట్ లతో కలిసి జాయింట్ సర్వే చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు రక్షణ సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ మిరియాల బాధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కోహెడ మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులుగా శెట్టి సుధాకర్ నియామకం



**కోహెడ, జూన్22 (జనంసాక్షి):** మండలంలోని ఎర్రగుంట పల్లి గ్రామానికి చెందిన వింజపల్లి గ్రామ మాజీ సర్పంచ్, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అయినా శెట్టి సుధాకర్ కాంగ్రెస్ పార్టీ కోహెడ మండల శాఖ నూతన అధ్యక్షులుగా నియామకం అయ్యారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచన మేరకు టీ పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కి, హుస్నాబాద్ శాసన సభ్యులు తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ సంగం శాఖ మాత్యులు శ్రీ పొన్నం ప్రభాకర్, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్ష రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేసినట్లు ఆయన అన్నారు.రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీనీ బలోపేతం చేయడానికి కాంగ్రెస్ పార్టీని మరోసారి అధికారంలోకి రావడానికి లక్ష్యంగా పని చేస్తానని సుధాకర్ అన్నారు. అలాగే మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను, సీనియర్ నాయకులను అందరిని కలుపుకొని వారి సహాయ సహకారాలతో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తానని పత్రిక ముఖంగా అన్నారు.

## నేటి నుంచి రైతు వేదికలలో విత్తన మేళా



**శివ్వంపేట, జూన్22 (జనంసాక్షి):** ఈ నెల 23 నుంచి 30 వ తేదీ వరకు శివంపేట, దొంతి రైతు వేదికలో విత్తన మేళా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మండల వ్యవసాయశాఖ అధికారి ఎన్.లావణ్య పేర్కొన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఈ విత్తన మేళాకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ విత్తనమేళాలో సన్నవడ్లు విత్తనాలు, పప్పు దినుసులు, నూనె గింజలు, కూరగాయల విత్తనాలు అలాగే నానో యూరియా,నానో డి.ఏ.పి ఇవ్వడం జరుగుతుందన్నారు. వరిలో సన్నరకాలు బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048, హెచ్ఎంటీ సోనా, జైశ్రీరాం, కేఎన్ఎం 1638, డబ్ల్యూజీఎల్ 44, కేఎన్ఎం 7715 లు ఉంటాయని చెప్పారు. కాబట్టి ఆసక్తి గల రైతులు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## రైతు వేదికలలో వారం రోజులపాటు విత్తనమేల

**- పేట వ్యవసాయ అధికారి నాగం కృష్ణ**



**పెద్ద శంకరంపేట, జూన్ 22 (జనంసాక్షి):** కలెక్టర్ ఆదేశానుసారం జూన్ 23 నుంచి వారం రోజులపాటు రైతు వేదికలలో విత్తనమేలను మూడు రైతు వేదికలలో పెద్ద శంకరంపేట్, శివయ్య పల్లి, రామోజీ పల్లి, రైతు వేదికల నుంచి విత్తన డీలర్లు అందరూ కూడా మూడు రైతువేదికలలో కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. విత్తన డీలర్లు దీనిలో భాగంగా రైతులు తమకు కావాల్సిన విత్తనాలను నానో, డీఏపీలను రైతు వేదికల నుంచి అవసరం ఉన్న రైతులు తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుందన్నారు ఈ మూడు రైతు వేదికలలో వారం రోజులపాటు విత్తనమేలను వ్యవసాయ శాఖ ద్వారా నిర్వహించనున్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## మత్తు కుటుంబాలను నాశనం చేస్తుంది

**- ఎస్సై శివానందం**

**చిన్నశంకరంపేట, జూన్21 (జనంసాక్షి):**



మత్తు పదార్థాలు కుటుంబాలను పూర్తిగా నాశనం చేస్తాయని ఎస్సై శివానందం అన్నారు. సోమవారం పట్టణంలోని మాడల్ కళాశాలలో ఆయన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. డ్రగ్స్ కు బానిస అవ్వడంతో జీవితాలు చిన్నాభిన్నం అవుతాయన్నారు. డ్రగ్స్ అనేవి కేవలం తాత్కాలిక ఆనందాన్ని ఇస్తాయి కానీ ఈ వ్యసనం ద్వారా బంగారు భవిష్యత్తు పాడు అవుతుందనన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వాణి కుమారి, వైస్ ప్రిన్సిపాల్ లింగం,సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమంలో 21 ఫిర్యాదులు స్వీకరణ..

**- జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు**



**గద్వాల నడిగడ్డ, జూన్ 22 (జనంసాక్షి);** జోగులాంబ గద్వాల జిల్లా ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సర్కిల్ అధికారుల సమక్షంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు తెలిపారు.
సోమవారము నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 21 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.
ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వారి వినతులు, ఫిర్యాదులను స్వీకరించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. తద్వారా ప్రజల్లో పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం పెరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటి పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందిస్తున్నామని తెలిపారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం వల్ల వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించే అవకాశం ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు.
వచ్చిన ఫిర్యాదుల్లో కళ్ళమ్ (దొడ్డి)కి నిప్పుపెట్టడం - 01, ప్లాట్ల ఆక్రమణకు సంబంధించినది - 01, గొడవలకు సంబంధించినవి - 02, భూ వివాదాలకు సంబంధించినవి - 15, ఇతర అంశాలకు సంబంధించినవి - 02 ఫిర్యాదులు ఉన్నాయి.

## రాజకీయ లబ్ధి కోసమే దీక్ష

**- మంత్రిగా ఉండి చేయలేనిది ఎమ్మెల్యే ఎలా చేస్తారు?**

**- గ్రామాన్నే కాదు, మండలాన్ని విలీనం చేయడానికి సిద్ధంగా ఉన్నారు**



**రేవల్లి, జూన్ 22 (జనంసాక్షి):** గతంలో రేవల్లి మండల విభజన జరిగిన సమయంలో ఆనాటి ప్రభుత్వంలో పని చేస్తున్నటువంటి నాయకులతో చర్చలు జరిపి తల్పునూర్ గ్రామాన్ని రేవల్లి మండలంలో కాకుండా నాగర్ కర్నూల్ జిల్లాలో విలీనం చేయుట కొరకు ఆనాడు నాగర్ కర్నూల్ ఎమ్మెల్యేగా పనిచేస్తున్న మరీ జనార్దన్ రెడ్డిని కలవడం జరిగింది. ఆ సమయంలో మరి జనార్దన్ రెడ్డి స్థానిక వనపర్తి ఎమ్మెల్యే, వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేస్తున్న సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తో మాట్లాడించాలని చెప్పడం జరిగింది. ఈ విషయమై స్థానికంగా ఉన్న నాయకులతో చర్చలు జరిపినప్పుడు వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న ఎమ్మెల్యే ఒక గ్రామాన్ని ఎలా వదులుకుంటారని ఆరోజు ఉన్న స్థానిక నాయకులు మమ్మల్ని నిలదీశారని అన్నారు. నిరంజన్ రెడ్డికి కలుపుకోవడమే తప్పుగా తప్ప వదులుకోవడం తెలియదని అన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రజల క్షేమం కోసం గ్రామాన్ని నాగర్ కర్నూల్ జిల్లాలో విలీనం చేయుటకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈరోజు దీక్ష చేస్తున్నటువంటి నాయకులు దీక్ష చేయటానికి స్థానిక ఎస్సైతో అనుమతి కోరడానికి వెళ్ళినప్పుడు నాకు విషయం తెలియడం తో స్థానికంగా ఉన్నటువంటి నాయకులకు ఫోన్ చేసి మన యొక్క గ్రామానికి ఉమ్మడి మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ పదవి ఇచ్చి నందున ఆ యొక్క ప్రమాణ స్వీకారం అనంతరం స్థానిక ఎమ్మెల్యేతో కలసి చర్చిద్దామని చెప్పడం జరిగిందని అన్నారు. ఎమ్మెల్యే స్థానికంగా లేనందున చర్చలు జరపడం కాస్త ఆలస్యం జరిగిందని అంతలోనే గ్రామస్తులతో చర్చలు జరపకుండా దీక్ష చేస్తున్నారని అన్నారు. గత పది సంవత్సరాలుగా ప్లానింగ్ బోర్డు చైర్మన్ వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న మీరే చేయకుండా ఆనాడు గుడ్డి గాడిద పళ్ళు తోమేరా అని అన్నారు. 10 సంవత్సరాలు అధికారంలో ఉండి చేయకుండా సాధారణ ఎమ్మెల్యేగా ఉండి ఎలా చేస్తారని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే నాగర్ కర్నూల్ జిల్లాలో గ్రామాన్ని విలీనం చేయుటకు 2029 డిలిమిటేషన్లో తప్పకుండా చేసేందుకు చిత్తశుద్ధితో ఉన్నారన్నారు. స్థానికంగా ఉండే చిన్న చిన్న సంఘాలను రాజకీయ పార్టీలను మద్దతు కోరి గ్రామ ప్రజలను తప్పుదోవ పట్టించి, వారి రాజకీయ స్వలాభం కోసమే గ్రామ అభివృద్ధిని అడ్డుకోవడానికి, వారి రాజకీయ ఉనికిని కాపాడుకోవడం కోసమే రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారని అన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల మూసివేత కుట్రను అడ్డుకుంటాం

**- జూన్ 23న రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల బంద్‌కు ABVP పిలుపు : టౌన్ సెక్రటరీ శంకర్**



**నారాయణఖేడ్, జూన్22 (జనంసాక్షి):** ఇంటిగ్రేటెడ్ పాఠశాలల పేరుతో ప్రభుత్వ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని, దీనికి నిరసనగా ఈ నెల 23న రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల బంద్‌కు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ABVP) పిలుపునిచ్చిందని నారాయణఖేడ్ టౌన్ సెక్రటరీ శంకర్ తెలిపారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 27 వేల ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 23 వేల పాఠశాలలను ఎత్తివేసి, మూడు లేదా నాలుగు మండలాలకు ఒకే తెలంగాణ పబ్లిక్ స్కూల్ లేదా ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ ఆలోచన గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తుకు తీవ్రనష్టం కలిగిస్తుందని అన్నారు. గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను మూసివేయాలనే ముఖ్య మంత్రి ప్రకటనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.
ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావడంతో పాటు విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించే విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఎంఈవో, డీఈవో పోస్టులతో పాటు టీచింగ్, నాన్-టీచింగ్ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, దయ నీయ స్థితిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక వసతులు కల్పించా లని అన్నారు. గురుకుల పాఠశాలలకు శాశ్వత భవనాలు నిర్మించి, ఫుడ్ పాయిజన్ ఘటనలకు తావులేకుండా విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# ఇల్లు లేని కుటుంబాలకు తక్షణ మంజూరు భరోసా

**- దేవరకద్రలో ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన**
**- ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్)**



**మహబూబ్ నగర్ మూసాపేట్ జూన్ (జనంసాక్షి):** దేవరకద్ర నియోజకవర్గంలోని మూసాపేట్ మండలం, కొమ్మిరెడ్డి పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల అమలుపై సమగ్ర పరిశీలన నిర్వహించారు ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్). హౌసింగ్ శాఖ మేనేజింగ్ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి వి. పి. గౌతమ్ కలిసి స్థలాన్ని సందర్శించిన ఎమ్మెల్యే జిఎంఆర్, ఇప్పటికే ఆమోదం పొందిన ఇండ్ల పురోగతిని పరిశీలించడంతో పాటు, ఇల్లు లేక గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాల గుడిసెలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్శన సందర్భంగా ఇల్లు లేని అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లను తక్షణమే మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే జిఎంఆర్ హామీ ఇచ్చారు. అర్హత నిర్ధారణ, సైట్ కేటాయింపు, సాంక్షన్ ఆర్డర్లు, పనులు ప్రారంభానికి అవసరమైన మార్గదర్శకాలను లోనే సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలను నేరుగా విని, లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా, వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. తరువాత నియోజకవర్గానికి చెందిన అన్ని మండలాల ఎంపీడీవోలతో ఎమ్మెల్యే జిఎంఆర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్లలో వస్తున్న ా2 ా3 దశల సాంకేతిక పరిపాలనా సమస్యలపై హౌసింగ్ ఎండి వి. పి. గౌతమ్ సమగ్రంగా చర్చించి, అనేక సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన అంశాలపై స్పష్టమైన టైమ్‌లైన్‌లతో చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజల గృహసంకల్పం నెరవేర్చడం ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత అని ఎమ్మెల్యే జిఎంఆర్ పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం నిబంధనల ప్రకారం నాణ్యతతో, సమయానికి పూర్తయ్యేలా నిరంతరం మానిటరింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. లబ్ధిదారుల సమాచారం ధృవీకరణ, ఫౌండేషన్ నుంచి ఫినిషింగ్ వరకు ప్రతి దశలో ఆలస్యం లేకుండా ముందుకు సాగేందుకు ప్రత్యేక ఫోకల్ పాయింట్లు ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ పరిశీలనలో హౌసింగ్ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఎంపీడీవోలు, గ్రామస్థులు పాల్గొన్నారు

# పెంచిన ఎరువుల ధరలను వెంటనే తగ్గించాలి

**- యూరియా యాప్‌ను రద్దు చేయాలి**
**- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కత్తుల భాస్కర్ రెడ్డి**
**- ఏఐకేఎస్ ఆధ్వర్యంలో తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా**



**చేర్యాల, జూన్ 22 (జనంసాక్షి):** భారీగా పెంచిన ఎరువుల ధరలను తగ్గించాలని, ఏకకాలంలో రైతు భరోసా డబ్బులు రైతు ఖాతాలో జమ చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎస్) సిద్దిపేట జిల్లా అధ్యక్షులు కత్తుల భాస్కర్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు సోమవారం చేర్యాల తహసిల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం తహసిల్దార్ దిలీప్ నాయక్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు శాపంగా మారిన యూరియా యాప్‌ను రద్దుచేయాలని, పెంచిన డీజిల్ పెట్రోల్ ధరలను తగ్గించాలని, రైతు భరోసాను మొత్తంగా ఒకే దఫాలో అన్ని ఎకరాలకు జూన్ 30వ తేదీలోపు రైతు ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలను, నకిలీ పురుగుమందులను అమ్మే వారిపై పిడి యాక్ట్ నమోదు చేసి శిక్షించాలన్నారు. పంటల బీమా పథకాన్ని రూపొందించే అమలు చేయాలని, రెండు లక్షలకు పైగా ఉన్న రుణాన్ని మాఫీ చేయాలని, రాష్ట్రస్థాయి పంటల బీమా పథకాన్ని రూపొందించి అమలు చేయాలని కోరారు. వాతావరణ అసమతుల్యత ఏర్పడిన పరిస్థితులలో గ్రామాన్ని యూనిట్ గా తీసుకొని పంటల బీమా ను అమలు చేయాలని, రైతులు పండించే ధాన్యానికి (సన్నాలు, దొడ్డు రకాల) బోనస్ ఇవ్వాలని, వ్యవసాయ అధికారులు మండల గ్రామస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ ఏ విత్తనాలు వేసుకోవాలి ఏ సమయంలో వేసుకోవాలనే విషయాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులను ఏకం చేసి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు నంగి కనకయ్య, లింగంపల్లి దేవదానం, ఎల్లవ్వ, లచ్చవ్వ, పోశయ్య, కిష్టయ్య, రాములు, మల్లేశం, నర్సిరెడ్డి, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

# మండల టాపర్లకునగదు పంపిణీ చేసిన విద్యాప్రదాత నర్సింహులు



**మల్దకల్, జూన్22 (జనంసాక్షి):** పదవ తరగతి ఫలితాలలో మండల స్థాయిలో టాపర్లకు అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సోమవారం స్థానిక పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ లో ప్రముఖ విద్యాప్రదాత,సీడ్ ఆర్గనైజర్ శేషంపల్లి నరసింహులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై, టాపర్లకు నగదు పురస్కారాలను అంద జేశారు. గత పది సంవత్సరాలుగా ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహిస్తున్న శేషంపల్లి నరసింహులు,ఈ విద్యాసంవత్సరానికి గాను తెలుగు,ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు విడివిడిగా నగదు పారితోషకాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎస్ఐ చేతుల మీదుగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ. 10,000 ద్వితీయ బహుమతిగా రూ.8,000, తృతీయ బహుమతిగా రూ.5,000 చొప్పున నగదు పురస్కారాలను, ప్రశంసా పత్రాలను పంపిణీ చేసిఅనంతరం టాపర్లను శాలువాలతో ఘనంగా సత్క రించారు. ఈ సందర్భంగా ఎస్ఐ, ఎంఇఒ సురేష్ మాట్లాడుతూ గ్రామీ ణ ప్రాంత విద్యార్థులు పదవ తరగతి ఫలితాలలో అద్భుత ప్రతిభ కనబరచడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ను ప్రోత్సహించడానికి గత పదేళ్లుగా తన సొంత నిధులతో నగదు బహుమతులు అందిస్తున్న విద్యాప్రదాత శేషంపల్లి నరసింహులు సేవలను ఆయన కొనియాడారు. విద్యార్థులు ఇదే పట్టుదలతో ఉన్నత చదువులు చదివి, తల్లిదండ్రులకు, మండలానికి మంచి పేరు తీసుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు రాజేశ్వర్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులుజాకీర్ హుస్సేన్, వెంకటయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## తీగలకుంటపల్లి

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ



**కోహెడ జూన్ 22 (జనంసాక్షి):** మండలంలోని తీగలకుంటపల్లి గ్రామం లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శ్రీలక్ష్మీ నరసింహ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులందరికీ మధ్యాహ్న భోజనానికి ఉపయోగపడేలా నాణ్యమైన స్టీల్‌ప్లేట్లు, గ్లాసులను ఉచితం గా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గ్రామ సర్పంచ్ మ్యాకల స్వర్ణలత– సురేందర్ రెడ్డి , పాఠశాల చైర్మన్ విద్యార్థులకు స్వయంగా అందజేశారు. మాతృభూమి రుణం తీర్చుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత. నక్క శ్రీనివాస్ రెడ్డి సేవా దృక్పథం గ్రామీణ విద్యార్థులకు ఎంతో ఆదర్శనీయమని సర్పంచ్, గ్రామ పెద్దలు కొనియాడారు. పాఠశాల సమస్యలపై హామీ స్కూల్‌లో ఉన్న మరికొన్ని మౌలిక వసతుల కొరతను త్వరలోనే ఫౌండేషన్ తరఫున తీరుస్తామని ఫౌండేషన్ చైర్మన్ హామీ ఇచ్చారు.

**అలాగే ముందు మరిన్ని సేవలు:** భవిష్యత్తులో స్కూల్ సమగ్ర అభివృద్ధికి, డిజిటల్ క్లాస్‌ల ఏర్పాటుకు, విద్యా సామగ్రి పంపిణీకి కూడా తమ ఫౌండేషన్ సిద్ధంగా ఉంటుందని ఫౌండేషన్ చైర్మన్ నక్క శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపా ధ్యాయ బృందం, తీగలకుంటపల్లి గ్రామస్థులు శ్రీలక్ష్మీ నరసింహ సేవా ఫౌండేషన్ నిర్వాహకు లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## నేడు ఏబీవీపీ ఆధ్వర్యంలో

# రాష్ట్రవ్యాప్త పాఠశాలల బంద్ విజయవంతం చేయాలి

**- రాష్ట్ర ఏబీవీపీ కార్యవర్గ సభ్యులు దినేష్ పాటిల్**



**పెద్ద శంకరంపేట, జూన్22 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్లో విచ్చలవిడి ఫీజుల దూకుడు అరికట్టి ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో నేడు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల బంద్ నిర్వహించనున్నట్లు ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దినేష్ పాటిల్ సోమవారం తెలిపారు. ఏబీవీపీ రాష్ట్రవ్యాప్త పిలుపుమేరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో విద్య చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# మైనర్ బాలికకు ప్రేమ ప్రపోజల్

**- యువకుడిపై పోక్సో కేసు నమోదు**

**రాజోలి/అలంపూర్ జూన్ 22 (జనంసాక్షి):** నువ్వంటే ఇష్టం..నిన్నే పెళ్లి చేసుకుంటాను అనే మధురమైన మాటల వెనుక దాగి ఉన్న అసలు కథ బయటపడటంతో అలంపూర్‌లో కలకలం రేగింది. 15 ఏళ్ల మైనర్ బాలికను లక్ష్యంగా చేసుకున్న ఓ యువకుడు ప్రేమ పేరుతో ఆమెకు దగ్గరవ్వాలని ప్రయత్నించినట్లు ఆరోపణలు వచ్చాయి. స్కూల్ నుంచి ఇంటికి వస్తున్న సమయం లో బాలికను సంప్రదించిన అవేశ్, ప్రేమిస్తున్నానంటూ నమ్మబలికి, మాట్లాడేందుకు ఒక మొబైల్ ఫోన్ కూడా ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం తనతో ఫోన్‌లో మాట్లాడా లని ఒత్తిడి చేయడమే కాకుండా, పలుమార్లు బెదిరింపులకు కూడా పాల్పడ్డాడని బాలిక తల్లి ఆరోపించారు. కూతురు ఎదుర్కొంటున్న పరిస్థితిని తెలుసుకున్న తల్లి వెంటనే పోలీసులను ఆశ్రయించడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. ఫిర్యాదు ఆధారంగా అలంపూర్ ఎస్ఐ రామకృష్ణ అవేశ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# రైతు వేదికలలో విత్తనాల మేళా

**నర్సాపూర్ జూన్ 22 (జనంసాక్షి):** నేడు 23 నుండి 30 వరకు ప్రతి రైతు వేదికల్లో విత్తనాల మేళా నిర్వహిస్తున్నట్లు సోమవారం వ్యవసాయ ఏడీఏ సంధ్యారాణి తెలిపారు. మేళాలో సన్న వడ్లు, పప్పు దినుసులు, నూనె గింజలు, కూరగాయల, విత్తనాలతో పాటు నానో యూరియా, నానో డిఏపి, అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



# ప్రీ ప్రైమరీ పాఠశాల ప్రారంభం



**పాపన్నపేట, జూన్ 22 (జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు నాణ్యమైన విద్యనభ్యసించవచ్చని మండల విద్యాధికారి ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని పాతలింగాయిపల్లి గ్రామంలో ఉపాధ్యాయులతో కలిసి ఆయన ప్రీ ప్రైమరీ పాఠశాలను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పోచయ్య, కాంప్లెక్స్ హెచ్.ఎం మహేశ్వర్,గ్రామ సర్పంచ్ సిద్దప్ప,అంగన్ వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేడు మనోహరాబాద్ రైతు వేదికలో విత్తన మేళా

**- రైతు సోదరులకు ఆహ్వానం**




**మనోహరాబాద్, జూన్23 (జనంసాక్షి):** ప్రభుత్వ నిర్ణయం మేరకు 23.06.2026 నుండి 30.06.2026 వరకు జిల్లాలోని అన్ని రైతువేదికలలో విత్తన మేళా నిర్వహించబడనుంది. ఈ మేళాలో ప్రభుత్వం సూచించిన 7 సన్న రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉంటాయి. రైతులు తమకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను ఒకే చోట కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించబడింది. కావున రైతులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విత్తన మేళాలో పాల్గొని తమకు కావలసిన విత్తనాలను కొనుగోలు చేసుకోవలసిందిగా కోరడమైనది.

# పేకాటరాయుళ్ల అరెస్ట్

**మిడ్జిల్, జూన్ 22 (జనంసాక్షి):** మండల పరిధిలోని సోమవారం దోనూరు శివారులో మామిడి తోటలో కొందరు పేకాట ఆడుతుండగా పోలీసులు మెరుపుదాడి చేసి ఇద్దరి నీ అరెస్ట్ చేయగా మిగతా కొందరు పారిపోయారని ఎస్సై శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. పేకాట రాయుళ్ల దగ్గర 25 వేల నగదు రెండు సెల్ ఫోన్లు. మూడు బైకులను స్వాధీనం స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్ తరలించినట్లు ఎస్సై శ్రీనివాస్ యాదవ్ తెలియజేశారు. పేకాట వ్యసనానికి బానిసలు అయితే కుటుంబాలు రోడ్డున పడతాయని ఇలాంటి వ్యసనాలకు బానిస కాకూడదని ఎస్ఐ సూచించారు.

# విద్యార్థులు డ్రగ్స్ పై అవగాహన పొందాలి

**- ఎస్సై దివ్య రెడ్డి**



**పెబ్బేరు, జూన్ 22 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి యువత కంకణం కట్టుకోవాలని మానవుని జీవితానికి ముప్పు వాటిల్లే మదకద్రవ్యాలు మానవ సమాజానికి పెను ప్రమాదమని పెబ్బేరు ఎస్సై దివ్య రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన డ్రగ్స్ పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో ఆమె ప్రసంగిస్తూ మతక ద్రవ్యాలు నియంత్రణ కుటుంబ సామాజిక బాధ్యతగా తీసుకొని ప్రతి ఒక్కరు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ వల్ల కలిగే అనారోగ్య సమస్యలతో పాటు చట్టపరమైన శిక్షలపై విద్యార్థులకు సంపూర్ణంగా వివరించారు. అంతేకాక డ్రగ్స్ నివారణ కోసం రాష్ట్రంలో 1908 ఇలాంటి నార్కోటిక్ హెల్ప్ లైన్ ఏర్పాటు చేయడం జరిగిందని ఎవరైనా టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇస్తే గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ డ్రగ్స్‌లో భాగంగా గుట్కా గంజాయి, మాటక ద్రవ్యాలు సిగరెట్టు మెదడుకు చెడు అలవాట్లను సైతం అనిపిస్తుందని ఇలాంటి మత్తు పదార్థాలకు దూరం ఉండాలని విద్యార్థులకు విద్యార్థి చేశారు. అదేవిధంగా డ్రగ్స్‌కు బానిసలైన వారికోసం వైద్య సహాయం కౌన్సెలింగ్ అందిస్తున్నామని తెలిపారు. మాదకద్రవ్యాలు మత్తు పదార్థాలు వివిధ రూపాలలో మనుషుల జీవితాలను కుటుంబాలను నాశనం చేస్తున్నాయని చాక్లెట్ రూపంలో కూడా మత్తు పదార్థం విక్రయిస్తున్న వ్యాపారుల పైన చర్యలు తీసుకుంటామని చదివించారు. ముఖ్యంగా విద్యార్థులు నేటి భావితరాలకు బాటలు వేయాలని ఈ దేశానికి యువత దిక్సూచి గా పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నియంత్రణ కోసం పోలీసులు నిర్విరామంగా కృషి చేస్తున్నారని తెలిపారు. సైబర్ క్రైమ్ తో పాటు ట్రిబుల్ రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ తదితర జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి జయరాములు ప్రధానోపాధ్యాయులు జి ఎన్ నరసింహ గౌడ్, ఉపాధ్యాయులు సుబ్బలక్ష్మి ప్రసన్న కమారి విద్యార్థులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**- జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు**

**గద్వాల నడిగడ్డ, జూన్22 (జనంసాక్షి);** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం జూన్-26ను పురస్కరించుకుని జోగుళాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా జూన్ 22 నుంచి 26 వరకు మాదకద్రవ్యాల నిర్మూలనపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు ఆదేశించారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో గ్రామాలు, పాఠశాలలు, కళాశాలలు, గ్రామ పంచాయతీలు, కమ్యూనిటీలు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ కార్యక్రమాల్లో భాగంగా గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో పాన్‌షాప్ యజమానులు, యువతతో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో జిల్లా ఎస్పీ స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాదకద్రవ్యాల నిర్మూలనలో సమాజంలోని ప్రతి ఒక్కరి పాత్ర కీలకమని పేర్కొన్నారు. ముఖ్యంగా పాన్‌షాప్ యజమానులు అప్రమత్తంగా ఉండి డ్రగ్స్‌కు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలు, అక్రమ విక్రయాలు లేదా ఇతర సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. డ్రగ్స్ వినియోగానికి ఉపయోగపడే పేపర్‌రోల్స్ విక్రయించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎవరైనా వాటిని కొనుగోలు చేయడానికి ప్రయత్నించినట్లయితే వారి వివరాలను కూడా పోలీసులకు అందించాలని కోరారు. డ్రగ్స్ వ్యసనానికి గురైన వారిని సమాజంలో చిన్నచూపు చూడకుండా, వారికి సరైన వైద్య సహాయం అందేలా ప్రోత్సహించాలని ఎస్పీ తెలిపారు. గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిలో డి-అడిక్షన్ సెంటర్ అందుబాటులో ఉందని, వ్యసనానికి గురైన వారు అక్కడ ఉచితంగా చికిత్సతో పాటు కౌన్సెలింగ్ సేవలను పొందవచ్చని వివరించారు. మాదకద్రవ్యాలు వ్యక్తి జీవితాన్నే కాకుండా కుటుంబం, సమాజం, దేశ భవిష్యత్తుపై కూడా తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్న ఎస్పీ, యువత డ్రగ్స్ బారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ "యాంటీ డ్రగ్ సోల్జర్"గా మారి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించే పోస్టర్‌ను విడుదల చేశారు.

అదే విధంగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహించిన కార్యక్రమాల్లో మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, చట్టపరమైన చర్యలు, యువత భవిష్యత్తుపై వాటి ప్రభావం



గురించి ప్రజలకు వివరించారు. డ్రగ్స్ రహిత గ్రామాలు, మండలాల నిర్మాణానికి ప్రజల సహకారం అవసరమని పోలీసులు విజ్ఞప్తి చేశారు. **'యాంటీ డ్రగ్ సోల్జర్'** సెల్ఫీ పాయింట్లను ప్రారంభించి, మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించే పోస్టర్‌ను విడుదల చేశారు. గద్వాల పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో గద్వాల సీఐ టంగుటూరి శ్రీను, గద్వాల టౌన్ ఎస్ఐలు కళ్యాణ్ కుమార్, ఎన్.కుమార్, ట్రాఫిక్ ఆర్ఎస్ఐ బాలచంద్రుడు, గద్వాల ప్రభుత్వ ఆసుపత్రి డి-అడిక్షన్ సెంటర్‌కు చెందిన ఇస్మాయిల్, పాన్‌షాప్ యజమానులు, యువత, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో అదనపు ఎస్పీ కె.శంకర్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సంబంధిత ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, యువత మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు

**- మంజీరా సంప్ హౌస్ పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్**



**సంగారెడ్డి, జూన్ 22 (జనంసాక్షి):** సంగారెడ్డి పట్టణ ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందించేందుకు మున్సిపల్ యంత్రాంగం అన్ని చర్యలు చేపడుతోందని మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్ తెలిపారు. సోమవారం పట్టణంలోని మంజీరా సంప్ హౌస్‌లో నీటి శుద్ధి ట్యాంకుల శుభ్రపరిచే పనులను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పాత బస్టాండ్-కొత్త బస్టాండ్ చౌరస్తా ప్రాంతాలను అనుసంధానించే ఇంటర్ కనెక్షన్ పైప్‌లైన్ పనులను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. మిషన్ భగీరథ నీటి సరఫరా తాత్కాలికంగా నిలిచిపోయిన పరిస్థితుల్లో కూడా పట్టణ ప్రజలకు తాగునీటి కొరత ఏర్పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి నిర్మించిన పాత సంప్ నుంచి నీటి సరఫరా అందించేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు వెల్లడించారు. పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతర తాగునీటి సరఫరా కొనసాగించేందుకు మున్సిపల్ యంత్రాంగం అప్రమత్తంగా పనిచేస్తోందని వారు పేర్కొన్నారు.

# కాంగ్రెస్ పై నిరాధరణ ఆరోపణలు బిఆర్ఎస్ పార్టీ నాయకులు మానుకోవాలి

**- కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులపై చర్చలకు సిద్ధమా...**

**- కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మూడావత్ రవి నాయక్**




**ఖిల్లా ఘనపురం 22 జూన్, (జనంసాక్షి):** కాంగ్రెస్ పార్టీపై బిఆర్ఎస్ నాయకుల నిరాధరణ ఆరోపణలు పనుకోవాలని నాయకులు రవి నాయక్ సోమవారం విలేకరుల సమావేశంలో తెలిపారు మాట్లాడుతూ బి ఆర్ఎస్ పార్టీ నాయకుల మాటలు ప్రజలు ఎవరు నమ్మరని గ్రామాలలో వారు పలుకుబడి తగ్గుతుందని భావించి కాంగ్రెస్ ప్రభుత్వం పై ఇటు వనపర్తి శాసనసభ్యులు మెగా రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూన్నారని అన్నారు గత పదేళ్ల బి ఆర్ ఎస్ పాలనలో అన్ని రంగాలలో ప్రజలను మోసం చేస్తూ వచ్చిందని మాయమాటలు చెప్పడంలో బిఆర్ఎస్ నాయకులు ఎప్పుడూ ముందుంటారు అని మా కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులపై చర్చలకు సిద్ధమా అనే బిఆర్ఎస్ నాయకులను ప్రశ్నించారు రైతులకు రైతు రైతు భరోసా తో పాటు బోనస్ డబ్బులు కూడా నేరుగా రైతుల ఖాతాల్లో వేస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అలాగే మండల కేంద్రంలో ఇటు వనపర్తి రోడ్డు కానీ మహబూబ్నగర్ రోడ్డు కానీ గత ప్రభుత్వంలో పూర్తిగా హస్తవ్యస్తం ఆయన రోడ్డును ఎమ్మెల్యే మెగా రెడ్డి రోడ్లను సుందరంగా చేశారని వనపర్తి నియోజకవర్గం అగ్రగామిగా నియోజకవర్గాన్ని రాష్ట్రంలో అగ్రగామిగా నిలబెట్టడానికి ఎమ్మెల్యే ఎంతో కష్టపడుతున్నారని ఆయన చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక బిఆర్ఎస్ నాయకులు ప్రెస్‌మీట్‌ల ద్వారా నిరాధారణ లేని ఆరోపణలు చేస్తున్నారని ఇలాంటి ఆరోపణలు మానకపోతే గ్రామాలలో తిరగనివ్వమని మీ చిట్టాలను రుజువులతో సహా మండల ప్రజల ముందు ఉంచుతామని డబుల్ బెడ్రూం లో మీరు చేసిన అవినీతిని బయట పెట్టాలా ఎవరితో ఎంత కమిషన్ తీసుకున్నారో చర్చకు సిద్ధమా,అని ఈ సందర్భంగా రవినాయక్ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అప్పారెడ్డిపల్లి కొత్తగోళ్ల కృష్ణయ్య, మామిడిమడ సర్పంచ్ లింగం, ఆగారం ప్రకాష్, గంజాయి రమేష్,క్యామ శ్రీరాములు,జయకర్, ఒమేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఇప్పపహాడ్
# గ్రామంలో ఘనంగా అక్షరాభ్యాసం కార్యక్రమం



**ఉర్కొండ జూన్ 22, (జనం సాక్షి);** ఊరుకొండ మండలం, నాగర్‌కర్నూల్ జిల్లాలి: **"విద్యతోనే గ్రామాభివృద్ధి"** అనే నినాదంతో ఇప్ప పహాడ్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సునీత రాజశేఖర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై, చిన్నారుల చేతులతో బియ్యపు గింజలపై అక్షరాలు దిద్దించారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేసి చదువు యొక్క విలువను వివరించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ సునీత రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, "అక్షరాభ్యాసం అంటే చదువుకు నాంది. చదువు లేనిదే గ్రామం అభివృద్ధి చెందదు. ప్రతి ఇంటి నుంచి ఒక్క పిల్లవాడినైనా బడికి పంపి, ఇప్ప పహాడ్‌ను 100% అక్షరాస్య గ్రామంగా మార్చడమే మా లక్ష్యం" అని పేర్కొన్నారు. ఉప సర్పంచ్ భాగ్యరాణి శివ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో అందుతున్న మధ్యాహ్న భోజనం, యూనిఫాం, పుస్తకాలు వంటి సౌకర్యాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భాగ్యరాణి శివ, వార్డు సభ్యులు, గ్రామస్తులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని, చిన్నారుల భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.

# మండల టాపర్లకు వాహనంపై ఊరేగింపు



**మల్దకల్, జూన్22 (జనంసాక్షి):** మండలంలోని పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ మల్దకల్ పాఠశాలలో 10వ తరగతి పరీక్షల్లో మండల స్థాయిలో టాప్ ర్యాంక్ సాధించిన విద్యార్థులను సోమవారం వాహనంపై ఊరేగింపు చేశారు. గ్రామ ప్రధాన వీధుల గుండా విద్యార్థులను ఊరేగింపుగా తీసుకెళ్లి వారి విజయాన్ని ప్రజలకు పరిచయం చేశారు. గ్రామస్థులు విద్యార్థులకు పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. అనంతరం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ శ్రీహరిముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల కృషి, పట్టుదలే ఈ విజయానికి కారణమని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. ఈ నగదు బహుమతులను దాత శేషంపల్లి నర్సింహులు, సీడ్ ఆర్గనైజర్ అందించారు. విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా మరింత మంది ఉన్నత ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సురేష్, ఇంచార్జ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు జాకీర్ హుస్సేన్, భాస్కర్ తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. మండల టాపర్లకు ఈ ఊరేగింపు గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# డ్రగ్స్ వద్దు - జీవితం ముద్దు

**- పాఠశాలలో అవగాహన కార్యక్రమం**
**- పాల్గొన్న ఉర్కొండ ఎస్సై రమాదేవి**




**ఉర్కొండ, జూన్22 (జనంసాక్షి);** యువతను డ్రగ్స్ మాయలో నుంచి కాపాడేందుకు ఊరుకొండ పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో "డ్రగ్స్ పై అవగాహన" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఊరుకొండ స్థానిక ఎస్సై రమాదేవి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు సైబర్ నేరాలు, డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. ఎస్సై రమాదేవి మాట్లాడుతూ, "ఒకసారి డ్రగ్స్ అలవాటు పడితే జీవితమే నాశనమవుతుంది. కుతూహలం, స్నేహితుల ఒత్తిడితో డ్రగ్స్ జోలికి వెళ్లొద్దు. ఎవరైనా డ్రగ్స్ అమ్మితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి అబ్దుల్ రహీం పాల్గొని చదువే అసలైన మత్తు అని, క్రీడలు, పుస్తకాలతో సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. డ్రగ్స్ వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింటుందని, తల్లిదండ్రుల కలలు కల్లలవుతాయని వివరించారు. విద్యార్థులు ప్రతిజ్ఞచేసి డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని సంకల్పం చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రీ-ప్రైమరీ స్కూళ్లను సద్వినియోగంచేసుకోవాలి..

**- మూడ్నళ్లు దాటిన చిన్నారులను తప్పనిసరిగా, ప్రీ-ప్రైమరీలో చేర్పించండి: ఎంఈఓ రాజునాయక్**



**మహమ్మదాబాద్, జూన్22 (జనంసాక్షి):** మూడు సంవత్సరాలు పూర్తయిన. ప్రతి చిన్నారిని ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రీ-ప్రైమరీ స్కూళ్లలో చేర్పించి నాణ్యమైన ప్రాథమిక విద్యను అందించాలని, మండల విద్యాధికారి (ఎంఈఓ) రాజునాయక్ తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. సోమవారం మీడియాతో, ఆయన మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా ప్రభుత్వం ఏడు ప్రీ-ప్రైమరీ స్కూళ్లను ఏర్పాటు చేసిందన్నారు. మూడు,నాలుగు,ఐదు సంవత్సరాల వయస్సుగల చిన్నారులను సమీపంలోని ప్రీ-ప్రైమరీ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ విద్యా సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈపాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ, తరగతులతో పాటు చిన్నారుల వయస్సుకు అనుగుణంగా నాణ్యమైన బోధన,అభ్యాస వాతావరణం కల్పిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమపిల్లల భవిష్యత్తుకు బలమైన పునాదివేయాలని,ఎంఈఓ రాజునాయక్ కోరారు.


# మండల అధ్యక్షుడిగా గంధం పురుషోత్తం



**జడ్చర్ల, జూన్ 22 (జనంసాక్షి):** మండల ఉపసర్పంచుల ఫోరం నూతన కార్యవర్గం సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. రాష్ట్ర ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు బొట్ల కార్తీక్ ఆదేశానుసారం, జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ యాదవ్ పర్యవేక్షణలో జరిగిన ప్రత్యేక సమావేశంలో మండల ఫోరం అధ్యక్షుడిగా పోలేపల్లి గ్రామ ఉపసర్పంచ్ గంధం పురుషోత్తంను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు గంధం పురుషోత్తం మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకున్న మండలంలోని అన్ని గ్రామాల ఉపసర్పంచులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఉపసర్పంచుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం మండలంలోని ఉపసర్పంచులందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తామని పేర్కొన్నారు. రాష్ట్ర మరియు జిల్లా నాయకత్వం సూచనల మేరకు మండల ఉపసర్పంచుల ఐక్యతను మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చిన్నాధిరాల ఉపసర్పంచ్ బాలస్వామి, ఉపాధ్యక్షులుగా మర్రిచెట్టు తండా ఉపసర్పంచ్ రాజు, పెద్దపల్లి ఉపసర్పంచ్ బాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కొండేడు ఉపసర్పంచ్ సతీష్, కోశాధికారిగా మాచారం ఉపసర్పంచ్ ప్రశాంతి శివకుమార్, కార్యదర్శులుగా కిష్టంపల్లి ఉపసర్పంచ్ శ్రీకాంత్, నసురుల్లాబాద్ ఉపసర్పంచ్ లక్ష్మణ్, ఉదండాపూర్ ఉపసర్పంచ్ నరేష్, మలభోయినపల్లి ఉపసర్పంచ్ శ్రీకర్, ఆల్వాన్ పల్లి ఉపసర్పంచ్ రాఘవులు ఎన్నికైనట్లు ప్రకటించారు.


# విత్తన మేళా - రైతులకు ఆహ్వానం

**- కొల్చారం రైతు వేదికలో....**
**- మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి**



**కొల్చారం, జూన్ 22(జనంసాక్షి):** ప్రభుత్వ నిర్ణయం మేరకు 23.06.2026 నుండి 30.06.2026 వరకు మండలంలోని కూల్చారం రైతు వేదికలో విత్తన మేళా నిర్వహించబడనుందనీ మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి తెలిపారు. ఈ మేళాలో ప్రభుత్వం సూచించిన 7 సన్న రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉంటాయి. రైతులు తమకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను ఒకేచోట కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించబడిందన్నారు. రైతులు అందరూ ఈ అవ కాశాన్ని సద్వినియోగం చేసుకొని విత్తన మేళాలో పాల్గొని తమకు కావలసిన విత్తనాలను కొనుగోలు చేసుకోవా లని మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి తెలిపారు.

# కలహాల కాపురం .. తండ్రి బలవన్మరణం



**పాపన్నపేట, జూన్ 22 (జనం సాక్షి):** కుమార్తె కాపురంలో కల హాలు ఏర్పడడంతో బాధతో ఓ వృద్ధ తండ్రి ఆత్మహత్య చేసుకున్నా డు. ఈ విషాద సంఘటన మెదక్ జిల్లా పాపన్నపేట శివారులో ఆది వారం రాత్రి వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు .. సోమ్లా తండాకు చెందిన బానోవత్ రాంసింగ్ (78) వ్యవ సాయం చేసుకుంటూ జీవనం కోన సాగిస్తున్నాడు. ఇతని చిన్న కూతురు రేణుకను టేక్మాల్ మండలం ముత్యాల బంధం తండాకు చెందిన నరేష్‌కి ఇచ్చి వివాహం జరిపించారు. గత కొంత కాలంగా కూతురు అల్లుడు మధ్య సంసార విషయాల్లో గొడవలు చోటు చేసుకుంటున్నాయి. మళ్లీ గొడవ జరగడంతో రేణుక పుట్టింటికి వచ్చింది. ఆదివారం పాపన్నపేటలో అందరీ సమక్షంలో రేణుకకు నచ్చజెప్పి ఆమె భర్త వద్దకు పంపేందుకు ప్రయత్నించగా రేణుకా అక్కడికి వెళ్ళేందుకు తిరస్కరించిది. మనస్థాపం చెందిన తండ్రి రాంసింగ్ ఆదివారం పాపన్నపేట గ్రామ శివారులోని డంపింగ్ యార్డు సమీపన ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్లిన స్థానికులు, బంధువులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటినా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి భార్య మీరి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

# మహబూబ్‌నగర్ జిల్లాలోని రైతు వేదికలలో విత్తన మేళా

**- జూన్ 23 నుండి 7 రోజుల వరకు రైతు వేదికలలో విత్తన మేళా**



**మహబూబ్‌నగర్ అర్బన్ జూన్ 22 (జనంసాక్షి):** వ్యవసాయ శాఖ డైరెక్టర్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచి వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించేందుకు మహబూబ్‌నగర్ జిల్లాలో జూన్ 23 నుండి 29 వరకు 17 మండలాలలో ఎంపిక చేయబడిన రైతు వేదికలలో "విత్తన మేళా" నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.గోవిండ్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు ఈ విత్తన మేళాలో వివిధ పంటలకు సంబంధించిన ధృవీకరించబడిన, నాణ్యమైన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉండనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ధాన్య సేకరణలో సూచించిన 7 రకాల వరి సన్న రకాల విత్తనాలు, అలాగే అపరాల విత్తనాలు, నూనెగింజల పంట విత్తనాలు, వివిధ రకాల కూరగాయల విత్తనాలు మరియు నానో యూరియా, నానో డీఏపీ రైతులకు కొనుగోలు కోసం అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.. రైతులు తమ అవసరాలకు అనుగుణంగా విత్తనాలను కొనుగోలు చేసుకొని, సకాలంలో విత్తనాలు విత్తడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. అందువల్ల జిల్లాలోని రైతు సోదరులందరూ తమ సమీప రైతు వేదికను సందర్శించి ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి అధిక దిగుబడులు సాధించవలసిందిగా వ్యవసాయ శాఖ తరఫున విజ్ఞప్తి చేశారురైతులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విత్తన మేళాను విజయవంతం చేయగలరని కోరారుఈ కార్యక్రమానికి సంబంధించిన పూర్తి వివరాల కోసం రైతులు తమ సంబంధిత మండల వ్యవసాయ అధికారిని సంప్రదించవలసిందిగా ఆయన సూచించారు.

# ప్రజావాణి పిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

**- ప్రజావాణిలో 117 వినతుల స్వీకరణ**
**- రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ**



**మహబూబ్ నగర్ ప్రతినిది జూన్ 22 (జనం సాక్షి):** ప్రజావాణిలో వచ్చిన పిర్యాదుదారుల దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ, అర్జిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జిదారుల సమస్యలను శ్రద్ధగా విన్నారు. ప్రతి సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని అర్జిదారులకు ఆమె భరోసా ఇచ్చారు. ప్రజావాణిలో మున్సిపల్, జిల్లా పౌరసరఫరాల, భూ సర్వే రికార్డుల శాఖ, గృహ నిర్మాణ శాఖ, విద్యాశాఖ, వైద్యఆరోగ్య శాఖ, రెవెన్యూ శాఖ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, గ్రామీణా భివృద్ధి, గిరిజన అభివృద్ధి, తదితర శాఖలకు సంబంధించి 117 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్ రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, డి.ఆర్.ఓ ఎ.నిర్మల, జడ్.పి.సి.ఈ.ఓ, ఇంచార్జి డి. పి.ఓ వెంకట్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గుంతపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



**కొండాపూర్ జూన్ 22, (జనం సాక్షి):** గుంతపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు బ్యాగుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులందరికీ గ్రామ సర్పంచ్ పడమటి అనంత్ రెడ్డి,బ్యాగులను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ పడమటి అనంత్ రెడ్డి మాట్లాడుతూ. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ ముందుంటుందని విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విద్యను అభ్యసిం చేలా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలనే లక్ష్యంతో త్వరలోనే షూస్, టైలు, యూనిఫాం డ్రెస్సులను కూడా పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. "విద్యార్థుల అభివృద్దే మా లక్ష్యం వారి భవిష్యత్తే మా బాధ్యత" అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు, యువకులు, విద్యార్థులు పలువురు తల్లిదండ్రులు పాల్గొన్నారు. సర్పంచ్ చేపడుతున్న విద్యా ప్రోత్సాహక కార్యక్రమాలను గ్రామస్థులు అభినందించారు. విద్యార్థులు కూడా కొత్త బ్యాగులు అందుకోవడంతో ఆనందం వ్యక్తం చేశారు.

# నస్రుల్లాబాద్ అభివృద్ధికి నిరంతరం కృషి

**- ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి**



**జడ్చర్ల, జూన్ 22 (జనంసాక్షి):** నస్రుల్లాబాద్ గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని నస్రుల్లాబాద్ గ్రామంలో నిర్వహించిన బొడ్రాయి పండుగ 41వ రోజు ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలందరికీ సొంత ఇల్లు ఉండాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన వారందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తామని స్పష్టం చేశారు. గ్రామంలోని సమస్యలను పరిష్కరించడంలోనూ, మౌలిక వసతుల కల్పనలోనూ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణను సద్వినియోగం చేసుకోవాలి

**- సందేహాలుంటే టోల్ ఫ్రీ 9553866388 కాల్ చేయాలి**
**- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్ బ్యూరో చీఫ్, జూన్ 22 (జనంసాక్షి):** జిల్లాలోని అర్హులైన పౌరులందరూ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తమ పేర్లను సరిచూసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. సోమవారం ఐడీఓసి కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి ,కలెక్టర్ మాట్లాడుతూ, తప్పులు లేని ఓటర్ల జాబితా రూపకల్పనకు అన్ని వర్గాలు సహకరించాలని సూచించారు. జిల్లాలో ప్రత్యేక సవరణ కార్యక్రమం జూన్ 25 నుండి జూలై 24 వరకు జరుగుతుందని తెలిపారు. బూతు స్థాయి అధికారులు ప్రతి ఇంటిని కనీసం మూడు సార్లు సందర్శించి గృహ గణన పత్రాలను అందజేస్తారని చెప్పారు. ఓటర్లు ఆ పత్రాలను పూరించి తిరిగి సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించారు. ఓటర్లు తమ వివరాలను ఇంటర్నెట్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చని, ఒకవేళ ఇంట్లో లేని పరిస్థితుల్లో ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

అక్టోబర్ 1, 2026 నాటికి 18 సంవత్సరాలు నిండే యువత కొత్త ఓటర్లుగా నమోదు చేసుకోవాలని, ఇందుకు బూతు స్థాయి అధికారుల వద్ద లభించే దరఖాస్తు పత్రాలను వినియోగించాలని సూచించారు. జూలై 31, 2026న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేయబడుతుందని, అనంతరం ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, దరఖాస్తులు స్వీకరించబడతాయని తెలిపారు. వచ్చిన అభ్యంతరాలపై విచారణ జరిపి తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 1, 2026న ప్రకటించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో గృహ గణన ప్రక్రియ 84 శాతం పూర్తయిందని తెలిపారు. చిరునామా మార్పులు ఉన్న ఓటర్లు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గృహ గణన పత్రాలు అందని వారు లేదా బూతు స్థాయి అధికారుల వివరాల కోసం రాష్ట్ర ఎన్నికల అధికారుల అధికారిక వెబ్సైట్లు సందర్శించవచ్చని, లేదా ఉచిత సహాయ సంఖ్య 1950 ను సంప్రదించవచ్చని తెలిపారు.

**ముఖ్య తేదీలు:**
**సవరణ కార్యక్రమం:** జూన్ 25 నుండి జూలై 24, 2026 వరకు
**ముసాయిదా జాబితా విడుదల:** జూలై 31, 2026
**అభ్యంతరాల స్వీకరణ:** ఆగస్టు 30, 2026 వరకు
**తుది జాబితా ప్రకటన:** అక్టోబర్ 1, 2026
**అర్హత :** అక్టోబర్ 1, 2026 నాటికి 18 ఏళ్లు నిండేవారు
ఏమైనా సందేహాలుంటే హెల్ప్‌లైన్ 1950 కి కాల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ రామచంద్ర రాజు, మీడియా ప్రతినిధులు, ఎలక్షన్ సూపరెండెంట్ ,తదితరులు పాల్గొన్నారు.

# కంగ్టీ పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



**సంగారెడ్డి, జూన్ 22 (జనంసాక్షి):** కంగ్టీ పోలీసు స్టేషన్‌ను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాల శుభ్రత, సిబ్బంది బ్యారక్, స్టేషన్ రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల స్థితిగతులను పరిశీలించారు. అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసులను సమీక్షించిన ఎస్పీ, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించి బాధితులకు అండగా నిలవాలని అధికారులకు సూచించారు. ఫిర్యాదు నమోదు నుంచి చార్జ్‌షీట్ దాఖలు వరకు ప్రతి కేసుకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా దర్యాప్తు పూర్తి చేసి నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరచాలని సూచించారు.

మహిళలపై జరిగే నేరాలు, పోక్సో చట్టం, సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలు, మూఢనమ్మకాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్‌హెచ్ఓకు సూచించారు. రాష్ట్ర సరిహద్దుల గుండా ఎలాంటి అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, చెక్‌పోస్టుల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, కేడీలు, అనుమానిత వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని, పగలు-రాత్రి బీట్ విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.

ప్రజలకు పారదర్శకంగా సేవలు అందేలా ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలిపారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఓపికగా విని తగిన పరిష్కారం చూపడంతో పాటు వారికి భరోసా కల్పించాలని ఎస్పీ సూచించారు.

ఈ తనిఖీలో నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, కంగ్టీ సీఐ వెంకట్ రెడ్డి, ఎస్‌హెచ్ఓ దుర్గారెడ్డి తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి : ఎస్సై శ్రీనివాస్ యాదవ్

**మిడ్జిల్, జూన్ 22 (జనంసాక్షి):** మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని స్థానిక ఎస్సై కే.శ్రీనివాస్ యాదవ్ విద్యార్థులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మత్తు పదార్థాలు నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు

అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని 'ఈగిల్ ఫోర్స్ తెలంగాణ' మరియు మిడ్జిల్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా సబ్ ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసులు హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. డ్రగ్స్ రహిత సమాజం: మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను, అవి యువత భవిష్యత్తును ఎలా నాశనం చేస్తాయో ఎస్సై విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. విద్యార్థి దశ నుంచే డ్రగ్స్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.

మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన ఎలాంటి సమాచారం ఉన్నా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్ 1908 కి లేదా ఈగిల్ ఫోర్స్ వాట్సాప్ నెంబర్ 8712671111కి సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడుతాయని స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థి 'యాంటీ డ్రగ్ సోల్జర్' (Anti-Drug Soldier)లా మారి సమాజంలో అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. చదువుతో పాటు మంచి నడవడిక అలవర్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది విద్యార్థిని




విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేశారు.

## చిరు వ్యాపారులను ఆదుకోవాలని కలెక్టర్‌కు వినతి



**మిడ్జిల్, జూన్ 22 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని కరెంట్ ఆఫీస్ దగ్గర చిరు వ్యాపారులు గత పది సంవత్సరాలుగా డబ్బాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. రాజకీయ నాయకులు. మండల అధికారులు. విగ్రహాల పేరుతో డబ్బాలను తొలగించాలని చూస్తున్నారని. సోమవారం చిరు వ్యాపారుల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. గత కొన్ని సంవత్సరాల నుండి డబ్బులు ఏర్పాటు చేసుకుని చిరు వ్యాపారాలు చేసుకొని జీనోపాధి సాగిస్తున్న మమ్ములను డబ్బాలు తొలగించి రోడ్లపైకి తీసుకురావద్దని మా కుటుంబాలు రోడ్డున పడతాయని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.అధికారులు దయ ఉంచి చిరు వ్యాపారుల పై డబ్బాలను తొలగించే ఆలోచనను విరమించుకోవాలని కలెక్టర్ ను కోరినట్లు చిరు వ్యాపారులు తెలియజేశారు. కార్యక్రమంలో చిరు వ్యాపారస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గృహహింస కేసులో నిందితునికి మూడు సంవత్సరాలు జైలు శిక్ష

**రాజాపూర్, జూన్22(జనంసాక్షి):** గృహహింస కేసులో నిందితునికి మూడు సంవత్సరాలు జైలు శిక్ష మరియు 2000 రూపాయలు జరిమానా. 2024 సంవత్సరంలో రాజాపూర్ పోలీస్ స్టేషన్లో క్రైమ్ నెంబర్ 67 లో నమోదైన గృహహింస కేసులో నిందితుడు సయ్యద్ అహ్మద్ అనే రాజాపూర్‌కు చెందిన వ్యక్తికి గౌరవ అసిస్టెంట్ సెషన్స్ జడ్జ్ గుండ్ల రాధిక విచారణ నిమిత్తము తుది తీర్పులో నేరస్తునికి మూడు సంవత్సరాల జైలు శిక్ష 2000 రూపాయలు జరిమానా విధించడం జరిగింది.

## పాంచజన్యమే టిఆర్ఎస్ ప్రధాన సిద్ధాంతం

**- కాందేనపల్లిలో ఘనంగా టీఆర్ఎస్ జెండా పండుగ**



**నారాయణపేట జూన్ 22(జనంసాక్షి):** పాంచజన్యమే టి ఆర్ ఎస్ పార్టీ సిద్ధాంతమని ఆపార్టీ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు గవినోళ్ల శ్రీనివాస్ అన్నారు.సోమవారంనారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం, కాందేనపల్లి గ్రామంలో టీఆర్ఎస్ జెండా పండుగ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ నాయకు లు మరియు మాజీ ఎంపీటీసీ జి. శ్రీనివాస్ గౌడ్, టీఆర్ ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. గ్రామ నాయకులు నరహరి, వెంకట్రాములు గౌడ్, అశోక్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు నర్సింహా రెడ్డి, ఆశన్‌పల్లి నారాయణ రెడ్డి, మొగుల్ మడకపల్లె బండ నర్సిములు, విట్లపూర్ బీషప్ప విట్టల్ గౌడ్, గవినోళ్ల జనార్దన్, మెట్టు నర్సింహా, ఎరుకలి రాములు, రంగయ్య గౌడ్, దొబ్బలి రాములు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ సిద్ధాం తాలు, లక్ష్యాలు, పాంచజన్యం కార్యక్రమం గురించి విస్తృతంగా వివరించారు. ఉచిత విద్య, ఉచిత వైద్యం, యువతకు ఉపాధి అవకాశాలు, సామాజిక న్యాయం, రైతు సంక్షేమం వంటి అంశాలపై పార్టీ కట్టు బడి పనిచేస్తుందని తెలిపారు.అలాగే గ్రామాభి వృద్ధి, రైతుల సమస్యల పరిష్కారం, బడుగు బలహీ న వర్గాల అభ్యున్నతి కోసం పార్టీ నిరంతరం ప్రజలతో కలిసి పనిచేస్తుందని పేర్కొ న్నారు. పార్టీ కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాల ని పిలుపునిచ్చారు.కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.ఈ కార్యక్రమంలో పార్టీ నాయ కులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయ వంతం చేశారు.

## మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం అవగాహన




**మల్దకల్, జూన్ 22 (జనంసాక్షి):** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం అవగాహన నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మల్దకల్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించి,యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు లక్ష్మణ్, జైపాల్ రెడ్డి, యుగేందర్ రెడ్డి పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు.పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి విద్య, క్రీడలు సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు.మండల విద్యాధికారి జి.సురేష్ విద్యార్థులకు విలువైన సందేశాన్నిఅందించారు.మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.ప్రతి విద్యార్థి మాదకద్రవ్యల రహిత సమాజం కొరకు ఒక సైనికుడిగా వ్యవహరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ద్వారా విద్యార్థులకు 1908 ఫోన్ నంబర్ పై అవగాహన కల్పించారు.

## మహాసభల విజయానికి సహకరించిన అందరికీ అభినందనలు



**ఉప్పునుంతల,(జనంసాక్షి):** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభల విజయవంతమైన నిర్వహణకు సహకరించిన ఉప్పునుంతల మండల ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రజలు, శ్రేయోభిలాషులకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం తరఫున జిల్లా ఉపాధ్యక్షులు చింతల నాగరాజు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

మహాసభల నిర్వహణ లో ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరి సేవలను ఆయన కొనియాడారు. భవిష్యత్తులో కూడా వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం అందరి సహకారం ఇదే విధంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

## మన ఊరి బడిని కాపాడుకోవడం మన బాధ్యత

**ఉప్పునుంతల, జూన్ 21 (జనంసాక్షి):** మండలంలోని గుట్టమీద తండా పాఠశాలలో శనివారం సర్పంచ్, ఉపసర్పంచ్ విద్యార్థులకు బ్యాగులు, పలకలు, పుస్తకాలు, పాఠశాల యూనిఫాంలు, ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు.

సర్పంచ్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, మన ఊరి బడిని కాపాడుకోవడం అందరి బాధ్యత అని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, అంగన్‌వాడీ టీచర్ భారతి, గ్రామ పంచాయతీ కార్యదర్శి చందర్, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సివిల్ సప్లై గోదాంలో వే బ్రిడ్జి ఏర్పాటు చేయాలి

**- కలెక్టర్‌కు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్ వినతి**



**సంగారెడ్డి, జూన్ 22 (జనంసాక్షి):** సంగారెడ్డి సివిల్ సప్లై ఎంఎల్ఎస్ పాయింట్‌లో వే బ్రిడ్జి ఏర్పాటు చేసి రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి తరఫున టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్ సోమవారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎంఎల్ఎస్ పాయింట్‌లో గత కొన్ని సంవత్సరాలుగా సరైన తూకం పరికరాలు లేకపోవడంతో రేషన్ డీలర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బియ్యం తూకంలో వ్యత్యాసాలు రావడం వల్ల డీలర్లకు ఆర్థిక నష్టం కలుగుతోందని పేర్కొన్నారు.రేషన్ డీలర్ల వినతిని పరిగణనలోకి తీసుకున్న నిర్మలా జగ్గారెడ్డి, సమస్యను పరిష్కరించేందుకు ఎంఎల్ఎస్ పాయింట్‌లో వెంటనే వే బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కంది మండల రేషన్ డీలర్ల అధ్యక్షుడు శంకర్, శశికాంత్, యూసుఫ్‌తో పాటు పలువురు రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా రేణుక ఎల్లమ్మ మాత కళ్యాణ మహోత్సవం



**పెద్ద శంకరంపేట, జూన్ 22 (జనంసాక్షి):** పెద్ద శంకరంపేటలోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ఆలయ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్చారణలతో ఎల్లమ్మ మాత కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం నుండి ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త దివంగత విగ్రం రామాగౌడ్ కుమారుడు వేణుగోపాల్ గౌడ్ దంపతులు స్వామివారికి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేశారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయాన్ని కొబ్బరి మట్టలు వివిధ రకాల పూలతో విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో మహిళలు భక్తులు పాల్గొని అమ్మవారికి ఓడి బియ్యం సమర్పించడంతోపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం భక్తులందరికీ అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు.. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రామ పెద్దలు మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## దాతృత్వం చాటుకున్న దంపతులు

**- విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, విద్యా సామగ్రి పంపిణీ**



**నాగర్‌కర్నూల్, జూన్ 22 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ మండలం కుమ్మెర గ్రామంలోని మండల ప్రజా పరిషత్ పాఠశాలలో గద్వాల జిల్లాకు చెందిన వాత్సవులు రమేష్-అనురాధ దంపతులు విద్యార్థుల కోసం స్కూల్ బ్యాగులు, పలకలు, నోట్‌బుక్స్, షూస్ తదితర 50 వేలు విలువచేసే విద్యా సామగ్రిని అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాగర్‌కర్నూల్ ఎంఈఓ కురుమయ్య వారి చేతుల మీదుగా పాఠశాలలో చదువుతున్న 80 మంది పేద విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటస్వామి, ఉపాధ్యాయులు శివ ప్రసాద్, అమరేందర్ రెడ్డి, ఎండి లతీఫ్, సత్యనారాయణ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## చీకటి సమయంలో భానుడి చల్లని వెలుగులు



**నర్వ, జూం22 (జనంసాక్షి):**

నర్వ మండల పరిధిలో సీపూర్ గ్రామంలో సాయంత్రం 7గంటల సమయం పూర్తి ఐన భానుడు ఇంకా పూర్తిగా కనుమరుగు కాక పొగ రైతులు ఆనందంగ చూస్తూ ఆరుద్ర కర్తరీ సందర్భంగా ఇలా ఉందేమో అని వనాల రాకకు శుభసుచిక అంటూ భారీగా వానలు పడే అవకాశం ఉందని ఆనందం వ్యక్తం చేశారు. మోటుగా ఎర్రగావు వస్తుంటే కాలం మంచిగా అవుతుందని పెద్దల నమ్మకం.

# తెలంగాణలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**- భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, రాగి రాములు**




**రామాయంపేట జూన్ 22 (జనంసాక్షి):** మెదక్ జిల్లా రామాయంపేట భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ (Special Intensive Revision) కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేయడానికి ఈ నెల 25వ తేదీ నుండి గ్రామాలు, పట్టణాల్లో బీఎల్ఓ లు ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు, సవరణ కార్యక్రమాన్ని ప్రారం భించనున్నారు. ఈ నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ తరఫున ప్రతి బూత్‌లో బూత్ లెవల్ ఏజెంట్-2 (BLA-2)లిలిలను నియమించడం జరిగింది. మెదక్ అసెంబ్లీ పరిధిలోని 274 బూత్‌లలో, నర్సాపూర్ అసెంబ్లీ పరిధిలోని 305 బూత్‌లలో బీఎల్ఏ-2లను పార్టీ నియ మించింది. మెదక్ జిల్లాలోని ప్రతి గ్రామం, తండా, బూత్‌లో భార తీయ జనతా పార్టీ కార్యకర్తలు ప్రజలకు సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారు.

ఇప్పటికే పార్టీ కార్యకర్తలు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ ఎస్ఐఆర్ కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు వివరిస్తున్నారు. “ఒక్కరికి ఒకే ఓటు” అనే లక్ష్యంతో ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించేందుకు ఈ కార్యక్రమం చేపట్టబడుతోంది. ప్రజలు ఎటువంటి అపోహలకు లోనుకావద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా ఎవరి ఓటు హక్కును అన్యాయంగా తొలగించడం జరగదు. ఓటరు జాబితాలో ఉన్న తప్పులను సరిచేయడం, మరణించిన వారి పేర్లను తొలగించడం, ఒక వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు నమోదు ఉంటే వాటిని నియమ నిబంధనల ప్రకారం సవరించడం మాత్రమే జరుగుతుంది. 2002 ఓటరు జాబితాలో పేరు ఉన్నవారు తమకు అందజేసిన ఫారాన్ని సక్రమంగా నింపి డిక్లరేషన్‌పై సంతకం చేసి బీఎల్ఓకు అందజేయాలి. ఒకవేళ 2002 ఓటరు జాబితాలో పేరు లేకపోయినా, తల్లిదండ్రుల వివరాలు, ఓటరు గుర్తింపు సంఖ్య వంటి ఆధారాలను సమర్పించడం ద్వారా అర్హులైన వారు తమ పేర్లను నమోదు చేసుకునే అవకాశం ఉంటుంది. ప్రతి ఇంటికి బీఎల్ఓలు రెండు ఫారాలు అందజేస్తారు. ఒక ఫారంపై బీఎల్ఓ సంతకం తీసుకుని ప్రజలు తమ వద్ద భద్రపరుచుకోవాలి. మరొక ఫారాన్ని పూర్తిగా నింపి, డిక్లరేషన్‌పై సంతకం చేసి బీఎల్ఓకు తిరిగి అందజేయాలి. ఇప్పటికే దేశవ్యాప్తంగా పలు సందర్భాల్లో ఓటరు జాబితా సవరణ కార్యక్రమాలు విజయ వంతంగా నిర్వహించబడ్డాయి. కాబట్టి ఈ కార్యక్రమంపై తప్పుడు ప్రచారాలను, అపోహలను ప్రజలు నమ్మవద్దు. ఎక్కడైనా సందేహాలు లేదా ఇబ్బందులు ఎదురైతే ప్రతి బూత్‌లో అందుబాటులో ఉన్న భార తీయ జనతా పార్టీ కార్యకర్తలను సంప్రదించి వివరాలు తెలుసు కోవచ్చు. ఈ ఓటరు సవరణ కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నాం. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే ఈ మహత్తర కార్యక్రమానికి సహకరించాలి.

# ఉపాధ్యాయులు విధుల పట్ల నిర్లక్ష్యం...

**- ప్రేయర్ ప్రారంభమైన తరువాత చేరుకుంటున్న ? ఉపాధ్యాయులు...**
**- ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం....**
**- ఉన్నత అధికారులు స్పందించి విద్య వ్యవస్థను గాడిలో పెట్టాలని ప్రజలు కోరుతున్నారు**



**కొల్చారం, జూన్ 22(జనంసాక్షి):** కొల్చారం మండలంలో ప్రభుత్వ బడులలో నిర్లక్ష్యపు నీళి నీడలు అలుముకున్నాయి. విద్యా వ్యవస్థ నిద్ర మత్తులో తూలుతోంది. పాఠశాలలు ప్రారంభమై వారం రోజులు దాటుతున్నా కొన్నిచోట్ల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించలేదు. విద్యార్థుల హాజరు శాతం తిరగడం లేదు. దీనికి తోడు కొందరు ఉపాధ్యాయులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారు. సోమవారం మండలంలోని వసురం తండా, అంసాన్ పల్లి, పోతిరెడ్డిపల్లి, పోతిరెడ్డిపల్లి తండా, జలాల్పూర్ గ్రామం, కొంగోడు గ్రామాలలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలను సందర్శించి చూడగా విద్యార్థుల హాజరు లేమి స్పష్టంగా కనబడుతుంది. జలాల్పూర్ గ్రామంలో ఉదయం9 :00 గంటల వరకు కూడా ఉపాధ్యాయులు పాఠశాలకు చేరుకోలేదు, 9 :10 నిమిషాలకు ఒక టీచర్ హడావిడిగా హాజరై ప్రేయర్ చేపించారు. అంసాన్ పల్లి ఉన్నత పాఠశాలలో పదిమంది ఉపాధ్యాయులకు గాను ఆరుగురు ప్రేయర్ కు హాజరవ్వగా, ఒకరు కాంప్లెక్స్ హెచ్ఎం విజిటింగ్ వెళ్లారని, ఒకరు లీవ్ లో ఉండగా, మరొకరు హాఫ్ డే లీవ్ లో ఉన్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా గడిచిన వారంలో జిల్లా విద్యాధికారి రాజు రెండు పర్యాయాలు మండలాన్ని సందర్శించినప్పటికీ ఉపాధ్యాయుల గైర్హాజరు, విద్యార్థుల హాజరు శాతం లోటు వంటి అంశాలపై స్పందించిన దాఖలాలు లేవు. ఉన్నతాధికారులు సరైన రీతులో స్పందించి విద్య వ్యవస్థను గాడిలో పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# పల్స్ పోలియో విజయవంతం చేయండి : వైద్యాధికారిని స్వరూపరాణి



**మల్దకల్, జూన్ 22(జనంసాక్షి) :** మండల కేంద్రంలోని మండల టాస్క్ ఫోర్స్,అధికారులు పల్స్ పోలియో కార్యక్రమాన్ని 28వ తేదీన విజయవంతం చేయడానికిఎంపీడీవో,సిడిపిఓమండల అధికారులుతో మెడికల్ ఆఫీసర్ మీటింగ్ ఏర్పాటు చేశారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఆశకార్యకర్తల,ఏఎన్ఎంలకు,ఎంఎల్ హెచ్ పిలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అందరు సిబ్బందికి 0-5 వయసు చిన్నారులకు పోలియో వ్యాధి రాకుండా పోలియో చుక్కల వ్యాక్సిను వేసే విధానం గురించి క్లుప్తంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వరూపారాణి,ఆశా కార్యకర్తలకు సిబ్బందికిపల్స్ పోలియో ట్రైనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగామండల కేంద్రంలోని మండల పరిషత్ మీటింగ్ హాల్ పల్స్ పోలియో కార్యక్రమం పైఅంగన్వాడి కార్యకర్తలకు టీచర్లకు ట్రైనింగ్ కార్యక్రమం, పోలియో చుక్కలు వేసే విధానం,ఇంటిపై మార్క్ చేసే విధానం,సమాజంలో 0-5, చిన్నపిల్లలను ప్రతి ఒక్కరిని తప్పక వేయాలని,100% వ్యాక్సినేషన్ చేయాలని, తదితర అంశాలపై వివరంగా ట్రైనింగ్ లో డాక్టర్ స్వరూప రాణి తెలిపారు.29 30 తేదీలలో బూతులలో ఇంటింటి తిరిగి మార్కింగ్ వెయ్యాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయ రెడ్డి,సూపర్వైజర్ హెల్త్ శ్రీధర్,హెల్త్ అసిస్టెంట్ నాగేంద్రం,సిడిపిఓ ఆకాశ దీప్తి,అంగన్వాడి సూపర్వైజర్,ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# పేటలో చేనేత సహకార సంఘం ఎన్నికలు ఏకగ్రీవం




**పెద్ద శంకరంపేట, జూన్ 22 (జనంసాక్షి):** పెద్ద శంకరంపేట చేనేత సహకార సంఘం ఎన్నికలు సోమవారం ఏకగ్రీవం అయ్యాయని ఎన్నికల అధికారి ఎండి యాకుబ్ అని తెలిపారు. చేనేత సహకార సంఘం అధ్యక్షులుగా మహంకాళి కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా నాంశం గారి సంతోష్ కుమార్ లను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఏర్పడిన కమిటీలో 9 మంది సభ్యులను నందయ్య గారి మధు, దొడ్ల సంగమేశ్వర్, నంశం గారి శ్రీనివాస్, ఎర్ర శ్రీహరి, జంగం రాములు, నంశం గారి సంతోష్, చందుపట్ల నవీన్ కుమార్, బుచ్చవ్వ, కృష్ణమూర్తిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏకగ్రీవమైన సభ్యులకు ఎన్నికల అధికారి ఎండి యాకుబ్ అలీ ధ్రువపత్రాలను అందజేశారు. అధ్యక్షుడిగా ఎన్నికైన మహంకాళి కృష్ణమూర్తి గతంలో 2008 సంవత్సరంలో కూడా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు పలువురు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు గుజ్జరి కనకరాజు, గుజ్జరి అనిల్, నీలి కుల సంఘం అధ్యక్షులు జస్వంత్ పాల్గొన్నారు.

# విత్తన మేళాలో ప్రభుత్వం సూచించిన వరి విత్తనాలను కొనాలి




**తూప్రాన్, జూన్ 22(జనంసాక్షి):** ప్రభుత్వ నిర్ణయం మేరకు ఈ నెల 23 నుండి 30 వరకు నర్సాపూర్ డివిజన్ లోని పది రైతువేదికలలో విత్తన మేళా నిర్వహిస్తున్నట్లు డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు సంధ్యారాణి తెలిపారు. రైతులు ప్రభుత్వం సూచించిన రకాలైన మాత్రమే వేయాలని వాటిని మాత్రమే కొనుగోలు చేస్తుంది అని తెలిపారు.

**మేళాలో ప్రభుత్వం సూచించిన 7 సన్న రకాల :** బిపిటి 5204 ( సాంబ మసూరి), ఆర్ఎన్ఆర్ 15048 ( తెలంగాణ సోనా), కే ఎన్ ఎం 1638, 7715, వరంగల్ 44 (సిద్ది), హెచ్ఎంటి, జైశ్రీరామ్ 7 వరి వంకటాలని మాత్రమే రైతులు పంట వెయ్యాలని తెలిపారు రైతు వేదికలలో వరి విత్తనాలు అందుబాటులో ఉంటాయి తీసుకోవచ్చని తెలిపారు. రైతులు తమకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను ఒకే చోట కొనుగోలు చేసుకునే అవకాశం కల్పిస్తుందని కావున రైతులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విత్తన మేళాలో పాల్గొని తమకు కావలసిన విత్తనాలను కొనుగోలు చేసుకోవలసిందిగా కోరారు.

# అక్రమ ఇసుక రవాణా పై కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన మాజీ ఎమ్మెల్యే



**మక్తల్, జూన్ 22 (జనంసాక్షి):** కృష్ణా మాగనూరు మండలాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న ఇసుక మాఫియాలపై చట్టపరమైన తీసుకోవాలని సోమవారం నారాయణపేటలో కలెక్టర్ ను వారి కార్యాలయంలో కలిసి మాజీ శాసనసభ్యులు చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఫిర్యాదు చేశారు. గత కొంతకాలంగా ఎలాంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా రాత్రి పగలు ఇసుక మాఫియా తమ ఇష్టారాజ్యంగా తరలించకపోవడం జరుగుతుందని తెలిపారు కలెక్టర్ కార్యాలయంలో ఇచ్చిన అనుమతులకు విరుద్ధంగా ఎక్కువ శాతం ఇసుకను తరలించకపోవడం జరుగుతుందని చెప్పారు. ఏ విధంగా యంత్రాలతో ఇసుకను ట్రిప్పర్లతో నింపి పంపించడం జరుగుతుందని వాస్తవంగా లేబరును పెట్టి వారికి ఉపాధి కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కాలంలో సక్రమంగా వర్షాలు లేక కూలీలకు పని లేక ఇబ్బందులు పడుతున్నారని ఇలాంటి రీచ్ ల దగ్గర కూలీలకు ఉపాధి కల్పించడం వలన వారికి న్యాయం చేసినట్లయితే ఆయన తెలిపారు. అదేవిధంగా కృష్ణ మండలంలోని బిఆర్ఎస్ పార్టీ నాయకుడు శివరాజు పాటేల్ ని కొందరు దుండగులు ఫోన్ చేసి బెదిరించడం జరిగిందని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం తీసుకోవాలని పోలీసులకు ఆదేశించాలని కలెక్టర్ ను కోరారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ అక్రమ ఇసుకని అడ్డుకోవడంతో పాటు బిఆర్ఎస్ పార్టీకి సంబంధించిన వ్యక్తులకు ఫోన్ చేసి బెదిరించి వ్యక్తులపై ఖచ్చితంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు స్పష్టం చేశారు. వారి మాజీ ఎమ్మెల్యే వెంబడి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి నరసింహ గౌడ్, సింగిల్ విండో అధ్యక్షుడు, కొత్తపల్లి మాగనూరు మండల పార్టీమాజీ అధ్యక్షుడు కే ఎల్లారెడ్డి, వెంకటరెడ్డి, శివరాజ్ పటేల్, శివప్ప, బాలప్ప, చిన్న బసప్ప గౌడ, అశోక్ గౌడ, అమ్రేష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాలు మారినా మారేది లేని జీపీ కార్మికుల బతుకులు..

**- జీతాలు పెంచాలని TUCI డిమాండ్!"**



**గద్వాల్, జూన్ 22 (జనంసాక్షి):** రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా గ్రామ పంచాయతీ (GP) కార్మికుల బతుకులు మారడం లేదు అని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (TUCI) ఆవేదన వ్యక్తం చేస్తూ నేడు ర్యాలీ ర్యాలీ అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా తర్వాత జిల్లా కలెక్టర్ అందించారు. వారు మాట్లాడుతూ పెరిగిన నిత్యవసరాల ధరలకు అనుగుణంగా జీపీ కార్మికుల జీతాలను తక్షణమే పెంచాలని, వారి సమస్యలను పరిష్కరించాలని యూనియన్ రాష్ట్రవ్యాప్తంగా డిమాండ్ చేస్తోంది.కనీస వేతనం రూ.18,000 – రూ.26,000: జీపీ కార్మికులకు జీవో నెంబర్ 6 లేదా 60 ప్రకారం కేటగిరీల వారీగా కనీస వేతనాలు అమలు చేయాలని TUCI నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం వస్తున్న అరకొర జీతాలు కుటుంబ పోషణకు సరిపోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మల్టీపర్పస్ వర్కర్ల విధానాన్ని రద్దు చేసి, సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న కార్మికులను జీవో నెంబర్ 51 సవరించి రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నారు.ప్రతి కార్మికుడికి పీఎఫ్ ఈఎస్ఐ ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 50,000 మంది గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాల కోసం ప్రభుత్వం ప్రతినెలా రూ.50 కోట్లను ప్రత్యేకంగా మంజూరు చేస్తోంది.ప్రతి నెల 1వ తేదీనే చెల్లింపు: ఐఏఎస్ అధికారులకు అందే విధంగానే, గ్రామ పంచాయతీ కార్మికులకు కూడా శాశ్వత, ఒప్పంద, ఔట్‌సోర్సింగ్ అనే తేడా లేకుండా ప్రతి నెల ఒకటో తేదీనే నేరుగా వారి ఖాతాల్లో జీతాలు జమ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.ప్రభుత్వం కేవలం ఒకటో తేదీన జీతాలు ఇస్తామని ప్రకటించినప్పటికీ, తమ ప్రధాన డిమాండ్ అయిన కనీస వేతనాల పెంపు మరియు ఉద్యోగ భద్రతపై స్పష్టమైన నిర్ణయం తీసుకునే వరకు కార్మికులతో కలిసి ఆందోళనలు ఉధృతం చేస్తామని TUCI నాయకులు హెచ్చరిస్తున్నారు.

# విద్యార్థులకు యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమం



**ఉప్పునుంతల, జూన్ 21 (జనంసాక్షి):** ఉప్పునుంతల పోలీస్ ఆధ్వర్యంలో స్థానిక జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, వాటి నివారణపై విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఏఎస్ఐ రెడ్యా నాయక్, ఉప్పునుంతల పోలీసు సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని విద్యార్థులకు సూచించారు.

# ప్రజావాణికి 32 ఫిర్యాదులు



**నారాయణపేట,జిల్లా బ్యూరో జూన్ 22(జనంసాక్షి):** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరిం చాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 32 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదా రులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను, డి.ఆర్.ఓ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ,డి.ఆర్.ఓ.రాజేశ్వరి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పేదరిక నిర్మూలనకు సమగ్ర కార్యాచరణ



**గద్వాల నడిగడ్డ, జూన్ 22 (జనంసాక్షి);** జోగులాంబ గద్వాల జిల్లాలో టిజిఐ ఎల్పి కి ఎంపికైన గట్టు మండలంలో పేదరిక నిర్మూలనకు సమగ్ర కార్యాచరణతో ముందుకెళ్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. తెలంగాణ ఇంక్లూజివ్ లైవ్‌లిహుడ్ ప్రోగ్రామ్ (టీజీఐఎల్పీ) గురించి సోమవారం హైదరాబాద్ నుంచి సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ ప్రోగ్రాంకు ఎంపికైన వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యంత పేద కుటుంబాలను శాశ్వతంగా పేదరికం నుంచి బయటకు తీసుకురావడమే తెలంగాణ ఇంక్లూజివ్ లైవ్‌లిహుడ్ ప్రోగ్రామ్ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

ఆయా కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటిని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవడం, జీవనోపాధి కోసం నిరంతర మార్గదర్శకత్వం చేయడం ద్వారా పేదరికం నుంచి బయటపడేలా చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమం అమలులో మహిళా స్వయం సహాయక సంఘాలు కీలక పాత్ర పోషించనున్నాయని పేర్కొన్నారు. ప్రతి 30 నుంచి 50 అత్యంత పేద కుటుంబాలకు ఒక కోచ్‌ను నియమించి, వారి ద్వారా ఆయా కుటుంబాల పురోగతిని నిరంతరం పర్యవేక్షించనున్నట్లు తెలిపారు.

గద్వాలలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లాలో అత్యంత వెనుకబడ్డ గట్టు మండలంలోని 14 గ్రామాల్లో 1033 నిరుపేద కుటుంబాలను ఇప్పటికే ఈ కార్యక్రమానికి ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఆయా కుటుంబాలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో వర్తింప చేస్తామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డిపిఓ శ్రీకాంత్, డిఆర్డిఓ ముషాహిదా బేగం, ఏపీడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# వనపర్తి ఎమ్మెల్యే ఇచ్చిన ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి

**- 3 నెలల హామీ- దాదాపు 3 ఏండ్లు కావస్తున్న ఎందుకు నేరవేరడం లేదు**

**- బిఎస్పీ వనపర్తి జిల్లా అధ్యక్షులు మిద్దె మహేష్ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు బోనాసి రామచందర్**



**రేవల్లి, జూన్ 22 (జనంసాక్షి):**
తల్పునూర్ గ్రామాన్ని నాగర్ కర్నూల్ జిల్లాలో కలపాలని గ్రామస్తులు ఏడు (7) రోజులుగా చేస్తున్న రిలే దీక్షలకు బిఎస్పీ పార్టీ నాయకులు సంపూర్ణ మద్దత్తు తెలిపారు. సోమవారం బహుజన సమాజ్ పార్టీ (బిఎస్పీ) ఆధ్వర్యంలో తల్పునూర్ గ్రామాన్ని నాగర్ కర్నూల్ జిల్లాలో కలపాలని గ్రామస్తులు గత 7రోజులుగా చేస్తున్న రిలే దీక్షలకు బిఎస్పీ గ్రామ అధ్యక్షులు గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి చందుల ఆధ్వర్యంలో బిఎస్పీ వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి కుంటి మధు, వనపర్తి జిల్లా అధ్యక్షులు మిద్దె మహేష్, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు బోనాసి రాంచందర్ అడ్వకేట్, నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఇంచార్జ్ సి. కళ్యాణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్ లు సంపూర్ణ మద్దత్తు ఇవ్వడం తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో ఉన్న తల్పునూర్ గ్రామాన్ని, నాగర్ కర్నూల్ జిల్లాలో విలీనం చేస్తానని ఇచ్చిన ఎన్నికల హామీని వెంటనే నేరవేర్చాలని డిమాండ్ చేశారు. 3 నెలల్లో విలీనం చేస్తానని ఎన్నికల్లో ఎమ్మెల్యే మేఘారెడ్డి ఇచ్చిన హామీని, దాదాపు 3 ఏండ్లు కావస్తున్న ఎందుకు నేరవేర్చడం లేదని నిలదీశారు. ఆనాడు ఉన్న నాయకుల స్వార్థ, రాజకీయ ప్రయోజనాల కోసం గోపాల్ పేట్ మండలాన్ని ఏకపక్షంగా వనపర్తిలో కలిపారని మండిపడ్డారు. ఇప్పుడు ఉన్న నాయకులు స్వార్థాన్ని వీడి తల్పునూర్ బాగు కోసం నాగర్ కర్నూల్ జిల్లాలో కలపాలని డిమాండ్ చేశారు. గోపాల్ పేట్ నుండి నూతన మండలంగా ఏర్పడిన రేవల్లి మండలంలో సౌకర్యాలు అరకొరగా ఉన్నాయని తెలిపారు. అవసరం ఐతే రేవల్లి మండలాన్ని మొత్తం నాగర్ కర్నూల్ జిల్లాలో విలీనం చేయాలనీ నాయకులు ప్రతిపాదించారు. అప్పుడైతేనే రోడ్డు రవాణా సౌకర్యాలు మెరుగు అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రోడ్డు రవాణా సౌకర్యాలు బావుంటేనే విద్యార్థినీల చదువుకు ఆటంకాలు ఉండవని అన్నారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు శివసేనరెడ్డి, ఎంపీ మల్లు రవి, ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి లు తక్షణమే స్పందించి తల్పునూర్ గ్రామాన్ని నాగర్ కర్నూల్ జిల్లాలో విలీనం చేయాలనీ డిమాండ్ చేశారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చకపోతే వివిధ రూపాల్లో ప్రభుత్వంపై ఒత్తిడి తేచ్చేలా భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష పార్టీల, సంఘాల నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

**- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



**వనపర్తి బ్యూరో జూన్ 22 (జనంసాక్షి):** వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం ఐ.డి. ఒ .సి సమావేశ హాల్లో జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో అన్ని లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో సీజనల్ వ్యాధులను అరికట్టడంలో ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన చర్యల పై కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు.వర్షాకాలంలో జిల్లాలో డెంగ్యూ, మలేరియా, చికెన్ గునియా, వాంతులు విరేచనాలు వంటి సీజనల్ వ్యాధులు ప్రబల కుండ అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా ఎప్పటికప్పుడు ఫీవర్ సర్వేలు నిర్వహించి రికార్డులు నిర్వహించాల్సిందిగా ఆదేశించారు.

అన్ని రెసిడెన్షియల్ విద్యాలయాలు, కళాశాలల్లో పనిచేస్తున్న వంట మనుషులు, భోజనం వడ్డించే వారికి ఐడల్ (టైఫాయిడ్) వైద్య పరీక్షలు నిర్వహించాలని, ఎవరికైనా వ్యాధి లక్షణాలు కనిపిస్తే రెండు వారాల పాటు క్వారంటైన్ చేసి వైద్యం అందించాలని వైద్య శాఖ అధికారిని ఆదేశించారు.గ్రామాలు, మున్సిపాలిటీల్లో అన్ని డ్రైన్ లు శు భ్రం చేయించాలని, పరిసరాల పరిశుభ్రతతో పాటు ప్రతి మంగళ, శు క్రవారాల్లో క్రమం తప్పకుండా డ్రై డే నిర్వహించాలని సూచించారు. అన్ని విద్యాలయాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఫ్రై డే – డ్రై డే పాటించాలని ఆదేశించారు. ఇంతకు ముందు సంవత్సరం ఎక్కడైతే డెంగ్యూ కేసులు నమోదు అయ్యాయో అట్టి వార్డుల్లో, గ్రామాల్లో ప్రత్యేక దృష్టి పెట్టి ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో ఎక్కడా నిలువ నీరు లేకుండా చూసుకోవాలని మున్సిపల్ కమిషనర్లు, డి.పి. ఒ ను ఆదేశించారు.ప్రతి నెల 11, 21, 31 వ తేదీల్లో మంచి నీటి ఓవర్ హెడ్ ట్యాంకులు శుభ్రం చేయాలని, శుభ్రం చేస్తున్న ఫోటోలు తీసుకోవడం, రిజిస్టర్ లో నమోదు చేయడం వంటివి జరగాలని సూచించారు. గ్రామాల సందర్శనకు వచ్చినప్పుడు ఈ రిజిస్టరును పరిశీలిస్తానని చెప్పారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఎన్ ఖీమ్య నాయక్, అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాయినాథ్ రెడ్డి, డిఆర్వో సూర్య ప్రకాష్ , ఎస్.డి.సి. తిరుపతయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఆర్జీలను పరిష్కరించాలి

- ప్రజావాణికి మొత్తం 60 దరఖాస్తులు
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**గద్వాల నడిగడ్డ, జూన్ 22(జనంసాక్షి);** ప్రజావాణికి వచ్చిన ఆర్జీలను పెండింగ్‌లో ఉంచ కుండా సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా ఐడిఓసి సమావేశపు మందిరంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించారు. ఈ వారం ప్రజావాణికి మొత్తం 60 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయిలోనే వివిధ ప్రజావాణి దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిష్కరిస్తే, ప్రజలు చిన్న చిన్న సమస్యలకు ఇక్కడి వరకు రావాల్సిన అవసరం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తి కోసం అత్తమామలకు కోడలి ద్రోహం

- వీధిన పడ్డ వృద్ధులను ఆదుకుని ఆదర్శంగా నిలిచిన కూతురు



**అయిజ 22 జూన్ (జనంసాక్షి):** ఆస్తి కోసం అత్తమామలను నమ్మించి మోసం చేసిన కోడలి ఉదంతం, అలాగే కన్న వృద్ధ తల్లిదండ్రులకు ఆశ్రయం కల్పించి కంటికి రెప్పలా చూసుకుంటున్న కూతురు వ్యవహారం.నేటి సమాజంలో మానవత్వం యొక్క రెండు విభిన్న కోణాలను కళ్ళకు కట్టినట్లు చూపుతోంది.వారసత్వ ఆస్తులు మరియు సంపద కోసం కుటుంబాలలో మానవత్వం మంటగలిసిపోతున్న ప్రస్తుత రోజుల్లో, తల్లిదండ్రులను ఆదరించి అన్నం పెట్టే కూతురు సమాజానికి ఆదర్శంగా నిలుస్తోంది. ఆస్తి కోసం కన్నవారిని వేధించడం చట్టరీత్యా నేరం మరియు అనైతికం అయితే అయిజ పట్టణానికి చెందిన ఆర్.కృష్ణమూర్తి నాగరత్నమ్మకు ఇద్దరు కుమారులు ఇద్దరు కుమార్తెలు,కిరాణా వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవారు.గత కొన్ని సంవత్సరాల క్రితం ఇద్దరు కుమారులు పెద్ద కోడలు మరణించారు.పెద్ద కుమారుడికి పిల్లలు లేకపోవడంతో చిన్న కుమారుడు కోడలుకి ఇద్దరు సంతానం,చిన్న కోడలు గీత సానుకూలంగా ఉంటూ మాయమాటలు చెప్పిన అత్త మామ ఆస్తి తన కుమారుడు (మనవడు) పేరు పై రాయించుకుని అత్తమామలను బయటకు గెంటేసింది.వృద్ధ దంపతులు ఎక్కడికి వేళ్ళలో దిక్కు తోచనిస్థితిలో వాళ్ళ పెద్ద కుమార్తె దగ్గర కాలం వెళ్ళదిస్తున్నారు.ఈ విషయాన్ని గతంలో జిల్లా కలెక్టర్ దగ్గగ విన్నవించుకున్నారు.అయిన న్యాయం జరగలేదని ఈరోజు 2వ సారి ప్రజావాణి లో కలెక్టర్ దగ్గర తన గోడును చెప్పుకున్నారు.ఎలాగైనా సరే మాకు జీవనభృతి కల్పించి మమ్మల్ని ఆదుకునేటట్లు చేయాలని విన్న వించుకున్నారు.

## సర్పంచ్ చొరవతో..మోగిన బడి గంట..

- బొట్లగడ్డతండా పాఠశాలకు మళ్లీ జీవం
- విద్యార్థులకు అక్షరాభ్యాసం నిర్వహించిన.ఎంఈఓ రాజునాయక్.
- ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుబాటులో..విద్యార్థులకు విద్య అధికారులు పిలుపు..

**మహమ్మదాబాద్,జూన్ 22 (జనంసాక్షి):** నాలుగు సంవత్సరాలుగా మూతపడి ఉన్న బొట్లగడ్డతండా ప్రభుత్వ పాఠశాల సర్పంచ్ చొరవతో సోమవారం తిరిగి ప్రారంభమైంది.గ్రామ సర్పంచ్ రామచంద్ర నాయక్ ప్రత్యేక కృషితో పాఠశాల పునఃప్రారంభం కావడంతో తండా ప్రజల్లో ఆనందం వ్యక్తమైంది.చాలా రోజుల తర్వాత విద్యార్థుల సందడితో పాఠశాల ప్రాంగణం కళకళలాడింది. ఈసందర్భంగా,మండల విద్యాధికారి (ఎంఈఓ)రాజునాయక్, ఎమ్మెల్సీ సురేందర్ రెడ్డి,సర్పంచ్ రామ్ చందర్,పాఠశాలను ప్రారంభించి.విద్యార్థులకు అక్షరాభ్యాసం నిర్వహించారు.సందర్భంగా,సర్పచ్ రామ్ చందర్ మాట్లాడుతూ..చిన్నారులకు విద్య ప్రాముఖ్యతను వివరించి,క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరుకావాలని అన్నారు.పాఠశాల మూతపడిన కారణంగా బొట్లగడ్డ తండాకు చెందిన విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సివచ్చిందని,దీంతో తల్లిదండ్రులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని గ్రామస్తులు తెలిపారు. ఇప్పుడు స్థానికంగానే ప్రభుత్వ పాఠశాల అందుబాటులోకి రావడంతో విద్యార్థులచదువుకు ఎంతో ఊరట లభించిందన్నారు.

## సీఎం రేవంత్ ను విమర్శించే అర్హత మాజీ ఎమ్మెల్యే చిట్టెంకు లేదు

- ప్రతిరోజు వెల్లువలా ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాలు
- పూర్తిస్థాయి రైతుల పక్షపాతి ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం




**మక్తల్, జూన్ 22 (జనంసాక్షి):** సీఎం రేవంత్ రెడ్డి ని విమర్శించే అర్హత, స్థాయి మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి కి లేదని మక్తల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తేల్చి చెప్పారు. సోమవారం మక్తల్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, సీనియర్ నాయకులు కట్ట సురేష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ కేసీఆర్ కాలిగోటికి సీఎం రేవంత్ రెడ్డి సరిపోరని మాజీ ఎమ్మెల్యే చిట్టెం అన్నారని అయితే కేసీఆర్ నుంచి సీఎం కుర్చీ ని దూరం చేసి, అదే సీఎం కుర్చీలో రేవంత్ రెడ్డి కూర్చున్నారని అన్నారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీ, సీఎం గా రేవంత్ రెడ్డి అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నారని తెలిపారు. ప్రతి రోజూ సీఎం గా రివ్యూలు, అభివృద్ధి పనుల్లో పాల్గొంటారని, ఫాం హౌస్ కు పరిమితం కాలేదని అన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి రోజుకు 20 గంటలు పని చేస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన 18 రోజుల్లో సంగంబండ బండరాయి పగలగొట్టి 20పైగా గ్రామాలకు సాగునీరు అందించారని అన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యే, 18 సంవత్సరాలు అధికారంలో ఉన్న రామ్మోహన్ రెడ్డి సంగంబండ బండరాయి పగలగొట్టలేదని విమర్శించారు. ఆగమేఘాలమీద ఎన్నికల సమయంలో ఆసుపత్రి కి శంకుస్థాపన చేసి తట్టెడు మట్టి తీయలేదని అన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి సహకారంతో 150 పడకల ఆసుపత్రి పనులు శరవేగంగా జరుగుతున్నాయని దసరాలోపు ఆసుపత్రిని ప్రారంభించేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. నియోజవర్గానికి దాదాపు 3500 ల ఇందిరమ్మ ఇండ్లు వచ్చాయని ఒక మక్తల్ పట్టణంలోనే 350 ఇండ్ల పనులు జరుగుతున్నాయని ప్రతిరోజు వెల్లువలా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు జరుగుతున్నాయని అన్నారు. గత ప్రభుత్వంలో అక్రమ ఇసుక, ఒండ్రు మట్టి రవాణా కు అడ్డు అదుపు లేకుండా పోయిందని అన్నారు. విమర్శల విషయంలో ఇప్పటికైనా మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి పద్ధతి మార్చుకొని విమర్శలు మానుకోవాలని, లేకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో మక్తల్ మున్సిపల్ చైర్మన్ వి.మానస హనుమంతు, మండల పరిషత్ మాజీ అధ్యక్షులు బి.చంద్రకాంత్ గౌడ్, కోఆప్షన్ సభ్యులు వల్లంపల్లి లక్ష్మణ్, బుక్క శంషుద్దీన్ ,మక్తల్ టౌన్ ప్రెసిడెంట్ ఏ. రవికుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్స్ శాలం, ఫయాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నీలప్ప, నీల గౌడ్, శంకర్, ఓబులేష్, గుడెబల్లూర్ నాగరాజ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వి.భాస్కర్, రవి, చిట్యాల అశోక్ పాల్గొన్నారు.

## విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి..

- డ్రగ్స్ రహిత సమాజం నిర్మించాలి : కృష్ణ ఎస్సై నవీద్



**కృష్ణ జూన్ 22 (జనంసాక్షి):** విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండి డ్రగ్స్ రహిత సమాజం నిర్మించాలని కృష్ణ ఎస్సై నవీద్ కోరారు.సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కున్సీలో విద్యార్థినీ విద్యార్థుల కోసం "డ్రగ్స్ రహిత తెలంగాణ" అంశంపై, ఈగిల్ ఫోర్స్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణ మండల సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నవీద్ మాట్లాడుతూ, నేటి సమాజంలో డ్రగ్స్ మహ మ్మారి రోజురోజుకీ పెను ముప్పుగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.డ్రగ్స్ రహిత తెలంగాణే మన లక్ష్యం. ఆ లక్ష్య సాధనలో విద్యార్థులే ప్రధాన భూమిక పోషించాలి" అని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు మత్తు పదా ర్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, అదే సమయం లో తమ కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు కూడా మత్తు పదార్థాలకు బానిసలు కాకుం డా అవగాహన కల్పించాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో సులభంగా లభించే మత్తు పదార్థాలు వాటి వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు వివ రించారు. కొందరు పెద్దలు బీడీ, సిగరెట్, మద్యం వంటి మత్తు పదార్థాలు తెప్పించ డానికి విద్యార్థులను వాహకు లుగా ఉపయోగిస్తున్నారని తన దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇలాంటి చర్యల కు పాల్పడే తల్లిదండ్రులు లేదా పెద్దలపై కఠిన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి వెనుకడుగు వేయబోనని హెచ్చరించారు. గ్రామ సర్పంచ్ మేకల సురేష్ మాట్లాడుతూ, మద్యపానం మరియు డ్రగ్స్ వల్ల సమాజానికి కలిగే నష్టాలను వివరించారు. తాను సర్పం చ్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంటనే గ్రామంలో మద్యపా న నిషేధం అమలు చేయాలనే సంకల్పాన్ని గ్రామస్థుల ముందుంచిన విషయాన్ని గుర్తు చేశారు.గ్రామంలో మత్తు పదార్థాల వినియోగం పూర్తిగా నివారించేందుకు కఠిన చర్యలు తీసుకుంటా మని తెలిపారు. విద్యార్థులు మంచి లక్ష్యాలను ఏర్పర చుకొని వాటి సాధన దిశగా కృషి చేయాలని, భవిష్యత్తు ను నాశనం చేసే మత్తు పదా ర్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి. సంతోషి మేడం, ఉపాధ్యాయ బృందం సభ్యులు పి. నరేందర్, ఖాసిం అలీ, సత్యనారాయణ రెడ్డి, నరసింహులు, ఉష, గీత, సౌమ్య, స్వాతి, ఆరీఫ్, నాగేష్, హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్, అలాగే ఈగిల్ ఫోర్స్ బృందం పాల్గొన్నారు.

## అడ్డాకుల మండలానికి వ్యవసాయ మార్కెట్ యార్డ్ మంజూరు

- మంజూరుపై హర్షం వ్యక్తం చేసిన మండల నాయకులు



**అడ్డాకుల జూన్ 22(జనంసాక్షి):** మండల కేంద్రానికి వ్యవసాయ మార్కెట్ యార్డ్ మంజూరైన సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు కందూరు నాగిరెడ్డి మాట్లాడుతూ గతంలో మండల శివారులోని సర్వే నంబర్ 161లో పలుగు గుట్ట సమీపంలో 6 ఎకరాల 20 గుంటల స్థలాన్ని పరిశీలించి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ద్వారా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. భూత్పూర్, మూసాపేట, అడ్డాకుల మండలాల రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మూడు మండలాలకు ఉమ్మడిగా వ్యవసాయ మార్కెట్ యార్డ్ మంజూరైనట్లు వెల్లడించారు.మార్కెట్ యార్డ్ మంజూరుపై మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోట శ్రీహరి జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు నాగిరెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మి నారాయణ జిల్లా కార్యదర్శి తిరుపతయ్య బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్న సీనియర్ నాయకులు విజయమోహన్ రెడ్డి బాలయ్య దేవరకద్ర మైనారిటీ అధ్యక్షుడు షఫీ అహమ్మద్

# మత్తు వదలండి... మైదానాలు చేరండి



జిల్లాను క్రీడల రంగంలో నెంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే కాకుండా ఒలింపిక్ క్రీడలలో దేశం తరుపున ప్రాతినిధ్యం వహించి బంగారు పతకం సాధించేలా క్రీడాకారులకు ఉత్తమ శిక్షణ ఇప్పించే ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. అవసరమైతే భూముల సేకరణ చేపట్టి క్రీడలకు సంబంధించిన అన్ని రకాల వసతులు కల్పిస్తామని తెలిపారు. యువతకు క్రీడల ద్వారా మరిన్ని అవకాశాలు కల్పిస్తూ వారి భవిష్యత్తును బలోపేతం చేయాలని సంకల్పించామని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రాబోయే రోజుల్లో దేశంలోనే క్రీడా రంగంలో అగ్రస్థానంలో నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

రాష్ట్ర డిల్లీ అధికార ప్రతినిధి,రాష్ట్ర క్రీడా సలహాదారులు ఎపి జితేందర్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో క్రీడారంగానికి ప్రాధాన్యం పెరిగిందన్నారు. గతంలో క్రీడలకు రూ.50 కోట్ల బడ్జెట్ మాత్రమే కేటాయించగా,ముఖ్యమంత్రి మొదటి సారి 350 కోట్ల రూ.లు కేటాయించి,తరువాత 640 కోట్లకు పెంచినట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ క్రీడల్లో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉందని, ఇప్పటికే వాలీబాల్ అకాడమీ, కబడ్డీ అకాడమీ మంజూరయ్యాయని చెప్పారు. జిల్లాకు స్పోర్ట్స్ స్కూల్ మంజూరు చేయాలని మంత్రిని కోరారు.,అందుకు అవసరమైన 30 ఎకరాల భూమిని ఇప్పటికే గుర్తించినట్లు ఆయన తెలిపారు. సరైన సదుపాయాలు కల్పిస్తే మహబూబ్‌నగర్ క్రీడాకారులు జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి మాట్లాడుతూ

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం 2914 నుంచి 2024 వరకు పదేళ్ల కాలంలో క్రీడా రంగానికి కేటాయింపు 300 కోట్లు దాటలేదని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి బడ్జెట్‌లోనే రూ.360 కోట్లు, రెండో బడ్జెట్‌లో రూ.468 కోట్లు, మూడో బడ్జెట్‌లో రూ.640 కోట్లు క్రీడా శాఖకు కేటాయించిందని తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా నిర్లక్ష్యానికి గురైన స్టేడియాలు, క్రీడా మైదానాలు, స్విమ్మింగ్ పూల్స్ పునరుద్ధరణకు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నామని, మహబూబ్‌నగర్ జిల్లాకు సుమారు రూ.12 కోట్ల 53 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అన్ని జిల్లాలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ ఒక్కో జిల్లాకు రూ.15 నుంచి రూ.18 కోట్ల వరకు క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేటాయిస్తున్నామని వెల్లడించారు. 2009 తర్వాత కోచ్‌ల నియామకాలు జరగకపోయినా, ప్రస్తుతం సుమారు 350 మంది కోచ్‌ల నియామకానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. తెలంగాణను దేశంలోనే క్రీడల హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఆధునిక ట్రాక్‌లు, మైదానాలు, స్విమ్మింగ్ పూల్స్, శిక్షణ కేంద్రాలు, నిపుణులైన కోచ్‌లను అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు. సీఎం కప్ పోటీల ద్వారా గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తిస్తున్నామని, మొదటి ఎడిషన్‌లో 3.5 లక్షల మంది, రెండో ఎడిషన్‌లో 5.5 లక్షల మంది విద్యార్థులు పాల్గొన్నారని,మూడవ ఎడిషన్ లో 10 లక్షల మంది పాల్గొంటారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఎంపికైన క్రీడాకారులకు ప్రత్యేక అకాడమీల్లో శిక్షణ, ప్రయాణం, వసతి తదితర ఖర్చులను తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ భరిస్తుందని చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన క్రీడాకారులకు కూడా అవసరమైన ఆర్థిక సహాయం అందించి, జాతీయ, ఆసియా, ఒలింపిక్ స్థాయిల్లో తెలంగాణ క్రీడాకారులు రాణించేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. రాబోయే మూడేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని క్రీడా మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు వెల్లడించారు.ఈ నెల 17 నుండి 26 వరకు నిర్వహించనున్న నషా ముక్త్ భారత్ సప్తాహ్ సందర్భంగా మాదక ద్రవ్యాల కు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేశారు.మాదక ద్రవ్యాల నిర్మూలన పై పోస్టర్ ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలోజిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్.పి డి.జానకి, మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేష్,స్థానిక కార్పొరేటర్ ఉమర్ కొత్వాల్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు , డివైఎస్ఓ రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

# ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

**- యువతకు అప్రెంటిషిప్ అవకాశాలను విస్తరించాలి**
**- మత్తు పదార్థాల రహిత జిల్లాకు కృషి చేయాలి**
**- పిలుపునిచ్చిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**గద్వాల నడిగడ్డ, జూన్ 22(జనంసాక్షి);** జిల్లాలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే విధంగా వివిధ ప్రభుత్వ పథకాలను అర్హులైన వారందరికీ వర్తింపజేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో టీజీ ఐపాస్, జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహక కమిటీ, మరియు ఎన్‌ఏటీఎస్ 2.0 సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను సంబంధిత శాఖల అధికారులు వేగవంతంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా మంజూరు చేయాలని ఆదేశించారు. పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన అన్ని రకాల సహకారాన్ని అందించి జిల్లాలో పారిశ్రామిక వృద్ధికి తోడ్పడాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఎంఎస్‌ఎంఈ పాలసీ--2024 కింద సేవా రంగానికి చెందిన ఎస్సీ పురుష పారిశ్రామికవేత్తలకు ప్రాజెక్టు వ్యయంలో 35 శాతం గరిష్టంగా రూ.75 లక్షలు, మహిళా పారిశ్రామికవేత్తలకు 45 శాతం గరిష్టంగా రూ.75 లక్షలు వరకు సబ్సిడీ అందజేయబడుతుందని తెలిపారు. అలాగే తయారీ రంగంలో ఎస్సీ పురుష పారిశ్రామికవేత్తలకు 50 శాతం గరిష్టంగా రూ.1.00 కోటి, మహిళా పారిశ్రామికవేత్తలకు 70 శాతం గరిష్టంగా రూ.1.20 కోట్లు వరకు సబ్సిడీ కల్పించబడుతుందన్నారు. సాధారణ వర్గానికి చెందిన పారిశ్రామికవేత్తలకు తయారీ రంగంలో పురుషులకు 25 శాతం గరిష్టంగా రూ.30 లక్షలు, మహిళలకు 45 శాతం గరిష్టంగా రూ.50 లక్షలు వరకు సబ్సిడీ మంజూరు చేయబడుతుందనీ పేర్కొన్నారు. అనంతరం నేషనల్ అప్రెంటిస్షిప్ ట్రైనింగ్ స్కీం అమలుపై చర్చించారు. యువతకు అప్రెంటిస్‌షిప్ అవకాశాలను విస్తరించడం, విద్యాసంస్థలు మరియు పరిశ్రమల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించడం, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ కల్పించడం వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఎన్‌ఏటిఎస్ 2.0 ద్వారా డిగ్రీ, డిప్లొమా, వృత్తి విద్య అర్హత కలిగిన యువతకు పరిశ్రమలలో ప్రత్యక్ష శిక్షణ అందించబడుతుందని, శిక్షణ కాలంలో స్టైపెండ్ చెల్లించబడుతుందని, శిక్షణ పూర్తిచేసిన వారికి భారత ప్రభుత్వం నుండి ప్రావీణ్యత ధ్రువపత్రం జారీ చేయబడుతుందని తెలిపారు. అలాగే జిల్లాలోని పరిశ్రమలు ఎన్ ఎటిఎస్ 2.0 పోర్టల్‌లో నమోదు చేసుకొని అప్రెంటిస్‌లను నియమించుకోవడం ద్వారా నైపుణ్యం కలిగిన మానవ వనరులను తీర్చిదిద్దడంతో పాటు కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పథకానికి సంబంధించిన పూర్తి వివరాలు, పరిశ్రమల నమోదు ప్రక్రియ కోసం అధికారిక వెబ్‌సైట్ https://nats.education.gov.in ను సందర్శించవచ్చని తెలిపారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, డిడబ్ల్యుఓ సునంద, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ రామలింగేశ్వర గౌడ్, జోనల్ మేనేజర్ జ్యోతి, ఇండస్ట్రియల్ ప్రమోషన్ అధికారి నాగేష్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబానికి
# పక్కా భవనం కలిగి ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యం



సాదాబైనామా దరఖాస్తులపై సమీక్ష నిర్వహించిన ఆయన, రెవెన్యూ అధికారులు ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. దరఖాస్తులను అనవసరంగా తిరస్కరించకుండా వాటిని వెరిఫై చేయడం తప్పనిసరి అని సూచించారు. అలాగే గృహజ్యోతి, సబ్సిడీ గ్యాస్ కనెక్షన్ పథకాల అమలుపై కూడా సమీక్ష నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం పురోగతిపై ఆరా తీసిన ప్రత్యేక అధికారి, మంజూరైన, గ్రౌండింగ్ జరిగిన, పూర్తయిన ఇళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. దీనికి స్పందించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి జిల్లాలో మొత్తం 5,982 ఇళ్లు మంజూరు కాగా, వాటిలో 5,173 ఇళ్లకు గ్రౌండింగ్ పూర్తైందని, 1,300 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని వివరించారు.ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అత్యంత పేద కుటుంబాలకు, ముఖ్యంగా గుడిసెల్లో నివసిస్తున్న అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే నిబంధనల ప్రకారం ఇళ్లను కేటాయించాలని ప్రత్యేక అధికారి స్పష్టం చేశారు. పథకం ప్రధాన లక్ష్యం నిరుపేదలకు శాశ్వత గృహ వసతి కల్పించడమేనని పేర్కొన్నారు. అలాగే తదుపరి విడతలో బేస్‌మెంట్ స్థాయి, పైకప్పు స్థాయి వరకు నిర్మాణం చేపట్టిన వారికి కూడా ఇళ్ల మంజూరు చేసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతున్న లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) ద్వారా రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధిక వడ్డీ వసూలు చేసే ప్రైవేట్ అప్పుల దారుల బారిన పడకుండా లబ్ధిదారులను అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా అవసరానికి మించి ఎత్తైన బేస్‌మెంట్లు, అధిక వ్యయంతో కూడిన నిర్మాణాలు చేపట్టవద్దని లబ్ధిదారులకు సూచించాలని, అలాంటి నిర్మాణాలు అప్పుల ఊబిలోకి నెట్టే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు.అనంతరం ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను ప్రత్యేక అధికారి తిలకించి, సంతృప్తి వ్యక్తం చేశారు.సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్య నాయక్, అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, అదనపు ఎస్పీ రాజేష్ మీనా, జిల్లా రెవెన్యూ అధికారి సూర్య ప్రకాష్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# చిట్యాల డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో సౌకర్యాల పరిశీన

**- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



**వనపర్తి బ్యూరో జూన్ 22 (జనంసాక్షి):** డబల్ బెడ్ రూమ్ ఇండ్ల కాలనీల ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ కార్పొరేషన్ ఎండి వీపి గౌతమ్ ఆదేశించారు.వనపర్తి శివారులోని చిట్యాల డబుల్ బెడ్‌రూమ్ గృహాల కాలనీని తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీలో కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను పరిశీలించారు.కాలనీలోని పరిస్థితులు, ప్రజలకు అందిస్తున్న సౌకర్యాల గురించి జిల్లా కలెక్టర్ ఎండీకి వివరించారు.

అనంతరం ఎండీ గౌతమ్ ప్రజారోగ్య, మున్సిపల్ శాఖ అధికారులకు కాలనీలో అవసరమైన సౌకర్యాలను మరింత మెరుగుపరచాలని సూచించారు. కాలనీ ప్రజలు మాట్లాడుతూ, కాలనీలోని ప్రభుత్వ స్థలాలను కొందరు అక్రమంగా ఆక్రమిస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అలాగే కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరగా, వీలైనంత త్వరగా వాటి ఏర్పాటుకు చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు.

కాలనీలో పారిశుధ్య సమస్యల పరిష్కారం కోసం సెప్టిక్ ట్యాంక్ సౌకర్యం కల్పించాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులకు ఎండీ గౌతమ్ సూచించారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసి కాలనీ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, హౌసింగ్ పీడీ విఠోబా, సంబంధిత శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# కృష్ణ ఎంపీడీఓ విజయలక్ష్మి బదిలీ

**కృష్ణ జూన్ 22 (జనంసాక్షి):** కృష్ణ మండల ఎంపీడీఓగా పనిచేస్తున్న విజయలక్ష్మి బదిలీ అయ్యారు. ఆమె నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండలానికి శుక్రవారం పదోన్నతి పై బదిలీ అయ్యారు.కృష్ణ మండల ఇంచార్జి ఎంపీడీవోగా సూపరింటెండ్ రామకృష్ణారెడ్డి కి బాధ్యతలు అప్పగించారు.అయితే నూతనగా ఊట్కూరు మండలంలో ఉన్న కిషోర్ కృష్ణ ఎంపీడీఓగా వస్తున్నట్లు ముఖ్య కార్యనిర్వహణ అధికారి జిల్లా పరిషత్ శ్రీనివాస్ తెలిపారు.

## నందికంది బ్లూ క్రాఫ్ట్ కంపెనీ ఎదుట గ్రామస్తుల ఆందోళన



**సదాశివపేట జూన్ 22 (జనంసాక్షి):** సదాశివపేట మండలం నందికంది గ్రామంలోని బ్లూ క్రాఫ్ట్ కంపెనీ ఎదుట గ్రామ సర్పంచ్ రాచర్ల ప్రవంత్రి విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు సోమవారం ధర్నా నిర్వహించారు. కంపెనీ నుంచి వెలువడుతున్న బూడిద, కాలుష్య నీటి వల్ల ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, పంట పొలాలు దెబ్బతింటున్నాయని ఆరోపించారు. కాలుష్య నీరు కాలువల ద్వారా మంజీరా నదిలో కలుస్తుండటంతో నది నీరు కూడా కలుషితమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, కంపెనీ యాజమాన్యం స్పందించి సమస్యను పరిష్కరించి గ్రామస్తులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు,యువకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉంటేనే భవిష్యత్తు

**- మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే**
**- చేర్యాల సీఐ బానోతు రమేష్ నాయక్**

**చేర్యాల జూన్ 22 (జనంసాక్షి):** మత్తు పదార్థాలకు దూరంగా ఉంటేనే భవిష్యత్తు, మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంటుందని చేర్యాల సీఐ బానోతు రమేష్ నాయక్ అన్నారు. సిద్దిపేట సీపీ ఆదేశాల మేరకు సోమవారం చేర్యాల పట్టణంలోని శ్రీ గాయత్రి, వికాస్ స్కూల్ లలో మత్తు పదార్థాల వినియోగం, వాటి వాళ్ళ కలిగే దుష్పరిణామాలు, పిల్లల భవిష్యత్తు వంటి అంశాలపై చేర్యాల పోలీసుల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రమేష్ నాయక్ మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటేనే మీ భవిష్యత్ బాగుంటుంది, ఒక్కసారి మత్తు పదార్థాలకు అలవాటు పడి వాటి నుండి బయటికి రావడానికి చాలా కష్టంగా మారుతూ మత్తులోనే జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. మీ కోసం మీ తల్లిదండ్రులు ఎంత కష్టపడుతున్నారు, వారు మీ భవిష్యత్ కోసం ఎన్నో కలలు కంటూ ఎన్నో త్యాగాలు చేస్తున్నారు. ఎప్పుడైనా ఒకరి జీవితం మరొక చేతిలో ఉండదు మీ జీవితం మీ చేతిలోనే ఉంటుంది,అలా ఉండాలంటే మన ఆలోచనలు చెడు వైపు కాకుండా మంచి వైపు ఉంటే అనుకున్నది సాధిస్తారు.ఎవరైనా మత్తు పదార్థాలు తీసుకున్న,కలిగి ఉన్న వెంటనే మీ పాఠశాల ఉపాధ్యాయులకు,స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ గూడ అపూర్వరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 26న పద్మశాలి ఉద్యోగుల రాష్ట్ర సదస్సు విజయవంతం చేయాలి

**- జిల్లా అధ్యక్షుడు జక్ల భాస్కర్ పిలుపు**

**నారాయణఖేడ్, జూన్ 22(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర పద్మశాలి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26న హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ స్వకులశాలి సమాజ భవనంలో రాష్ట్ర స్థాయి పద్మశాలి ఉద్యోగుల సదస్సు నిర్వహించనున్నట్లు సంగారెడ్డి–మెదక్ జిల్లా అధ్యక్షుడు జక్ల భాస్కర్ తెలిపారు. రాష్ట్ర సంఘం అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరగనున్న ఈ సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జక్ల భాస్కర్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా పద్మశాలి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, సంఘం చేపడుతున్న వివిధ కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై సదస్సులో విస్తృతంగా చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సంఘం బలోపేతం కోసం ఈ సదస్సు కీలక వేదికగా నిలుస్తుందని అన్నారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన పద్మశాలి ఉద్యోగులందరూ పెద్ద సంఖ్యలో హాజరై రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి సాయిప్రసాద్, కార్యవర్గ సభ్యులు పాశికంటి లక్ష్మీనారాయణ, వెంకటేష్, పోలా భూమయ్య, ఇంజమూరి హనుమండ్లు, మద్దెల ప్రదీప్, వేణుగోపాల్, గోవర్ధన గిరి, గోపీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

**- కలెక్టర్‌ను కలిసిన పుల్కల్ గ్రామ రైతులు**

సంగారెడ్డి, జూన్ 22 ( జనం సాక్షి)

పుల్కల్ గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో జరుగుతున్న అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్‌ను కలిసి గ్రామ రైతులు వినతిపత్రం సమర్పించారు. సహకార సంఘం అధ్యక్షుడు అనంతరావు కులకర్ణి, ప్రధాన కార్యనిర్వాహక అధికారి నాగయ్య, జిల్లా సహకార బ్యాంకులో పనిచేస్తున్న ఇసోజీపేట అనిల్, సంఘంలో పనిచేస్తున్న ఇసోజీపేట భాస్కర్‌లు అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ రైతుల భూముల ఖాతాలకు సంబంధించిన వివరాలను దుర్వినియోగం చేస్తున్నారని రైతులు ఆరోపించారు. అలాగే రైతులకు కేటాయించిన రాయితీ ఎరువుల బస్తాలను అక్రమంగా తరలిస్తున్నారని పేర్కొన్నారు. సంఘానికి వచ్చిన 100 డీఏపీ ఎరువుల బస్తాల్లో 35 బస్తాలను నాగయ్య, ఇసోజీపేట భాస్కర్ కలిసి అక్రమంగా తరలించారని రైతులు ఆరోపించారు. అర్ధరాత్రి వేళల్లో ఎరువుల బస్తాలను సంఘం నుంచి తరలిస్తున్నారని వినతిపత్రంలో తెలిపారు.

ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌ను రైతులు కోరారు.

# కంపెనీ అభివృద్ధే కార్మికుల అభివృద్ధి

**- ఎమ్మెల్యే తాటికొండ వెంకటరమణారెడ్డి**



**తూప్రాన్, జూన్ 22,(జనంసాక్షి):** మెదక్ జిల్లా, తూప్రాన్ మండలం, బ్రాహ్మణపల్లి లోని టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (టీసీఎల్) టాటా కాఫీ కంపెనీ కార్మిక సంఘం నూతన అధ్యక్షుడిగా కామారెడ్డి ఎమ్మెల్యే టిసిఎల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడిగా తాటికొండ వెంకటరమణారెడ్డి నీ ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా సోమవారం ఎంప్లాయిస్ యూనియన్ , మేనేజ్మెంట్ ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కామారెడ్డి ఎమ్మెల్యే, టీసీఎల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రెసిడెంట్ తాటికొండ వెంకటరమణారెడ్డి గారు కంపెనీ గెట్ ముందు బీఎంఎస్ జెండాను ఆవిష్కరించి కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక కుటుంబంలో భార్యాభర్తలు పరస్పర సహకారంతో ముందుకు సాగినట్లే కంపెనీ యాజమాన్యం, కార్మికులు కూడా ఐక్యంగా పనిచేస్తే సంస్థ అభివృద్ధి చెందడంతో పాటు కార్మికుల జీవితాలు కూడా మెరుగుపడతాయని అన్నారు. కంపెనీ బాగుంటేనే కార్మికుల సంక్షేమం సాధ్యమవుతుందని, చిన్న చిన్న సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. కంపెనీ అభివృద్ధి, కార్మికుల ఎదుగుదల ఒకదానికొకటి విడదీయరాని సంబంధం కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. యాజమాన్యం, కార్మికులు పరస్పరం లాగుడుదీతలకు దిగితే సమస్యలు జటిలమై ఇరువర్గాలకు నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. కార్మిక నాయకుడిగా, యూనియన్ అధ్యక్షుడిగా కార్మికుల సమస్యల పరిష్కారంలో సమర్థవంతమైన మధ్యవర్తిత్వం నిర్వహించి న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

రాజకీయాల్లో అవినీతికి తాను పూర్తిగా వ్యతిరేకమని, ప్రజల డబ్బును దుర్వినియోగం చేసే వారిని సహించనని స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసంతో గత, ప్రస్తుత ముఖ్యమంత్రులపై విజయం సాధించిన ఎమ్మెల్యేగా తన బాధ్యతను ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటానని చెప్పారు. అవసర సమయంలో అండగా నిలబడటమే నిజమైన సేవ అని, కష్టకాలంలో ఇచ్చే ధైర్యం ఎన్నో కుటుంబాలకు బలాన్నిస్తుందని పేర్కొన్నారు.

కార్మిక సంక్షేమంతో పాటు పరిశ్రమ అభివృద్ధికి ఇది దోహదపడుతుందని పాల్గొన్నవారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీసీఎల్ సైట్ హెడ్ శివకుమార్, హెచ్.ఆర్ కోటేశ్వర రావు, క్వాలిటీ ఆఫీసర్ రాకేష్, ప్రొడక్షన్ మేనేజర్ సుధాకర్ రెడ్డి, మెయింటెనెన్స్ ఇన్‌చార్జి రంగనాయకులు, బీజేపీ రాష్ట్ర నాయకులు ఎం. గిరీష్ రెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జి వర్గంటి రామ్‌మోహన్ గౌడ్, బిజెపి పట్టణ అధ్యక్షులు భూమన్నగారి జానకిరామ్ గౌడ్, మండల అధ్యక్షులు పిట్లా పోచయ్య ముదిరాజ్, పడాలపల్లి కౌన్సిలర్ సత్యనారాయణ, సంఖ్య యాదగిరి, రఘువీరారెడ్డి, వెంకట నాగేంద్ర గౌడ్, జక్కిడి నరేందర్ రెడ్డి (బుల్లెట్ రాజు), యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్లు జి. నర్సింగ్‌రావు, వి. రఘుపతి రెడ్డి, జనరల్ సెక్రటరీ లంబ లవకుమార్ యాదవ్, జాయింట్ సెక్రటరీలు బొంది శ్రీనివాస్ గౌడ్, టి. వీరప్రసన్న, ట్రెజరర్ బి. వెంకట్రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు పి. ప్రవీణ్, జి. సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్లు కే. దైవాదీనం, ఎల్. మహేష్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఎం.రామశర్మ, కార్మిక నాయకులు, మహిళా కార్మికులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## చెడు అలవాట్లతో విద్యార్థులు బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు

**- కోహెడ ఎస్సై పుల్ల అభిలాష్**



**కోహెడ జూన్ 22(జనంసాక్షి):** చెడు అలవాట్లకు అలవాటు పడి తమ విద్యార్థులు, యువత బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దని కోహెడ ఎస్సై పుల్ల అభిలాష్ అన్నారు. సోమవారం మండల కేంద్రం లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాల లో విద్యార్థుల కు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాల పట్ల అవగాహన కల్పించారు. డ్రగ్స్ వ్యసనం ఒక వ్యక్తి కుటుంబ సమస్య మాత్రమే కాదని దేశ భవిష్యత్తును దెబ్బతీసే ఒక సామాజిక దురాచారం అని ఆయన అన్నారు. స్కూల్, కాలేజీలో జరిగిన డ్రగ్స్ పై జరిగిన ఈ కార్యక్రమంలో కోహెడ ఎస్సై మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థలు సమాజం మొత్తం మాదక ద్రవ్యాల పట్ల సరైన అవగాహన కలిగి విద్యార్థులకు, యువతకు అర్థమయ్యేలా వివరించాలని, యువత ఆరోగ్యవంతంగా క్రమశిక్షణతో నైతిక విలువలతో ఎదిగినప్పుడే లక్ష్యాలు సహకారం అవుతాయి అని పేర్కొన్నారు. విద్యాసంస్థల్లో ప్రవేశాల సమయంలో విద్యార్థులతో మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించాలని తెలిపినారు. వ్యక్తిత్వ వికాసానికి విలువల నిర్మాణానికి విద్యార్థులు సేవ, క్రమశిక్షణ నాయకత్వ లక్షణాలతో సరైన మార్గంలో నడిచేలా ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు చొరవ తీసుకోవాలి. పిల్లల ప్రవర్తనలో చదువులో స్నేహ సంబంధాల్లో వచ్చే ఆకస్మిక మార్పులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గమనించాలని ఎస్సై తెలిపారు. అసాంఘీక కార్యక్రమాలు జరిగితే పోలీస్ వారికి సమాచారం అందించాలని తెలిపినారు.ఈ కార్యక్రమం లో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులున్నారు.

## నేటినుంచి శ్రీ గురుపీఠంలో వార్షికోత్సవ వేడుకలు

**- హాజరుకానున్న సాధు పుంగవులు**
**- శ్రీశ్రీశ్రీ వేదనందా సరస్వతీ స్వామీజీ, వేద పండితులు**

**శివ్వంపేట, జూన్ 22 (జనంసాక్షి):**

శ్రీ విశ్వయోగి విశ్వంజి మహారాజ్ ఆశీస్సులతో శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ దత్తాత్రేయ మహాస్వామి పంచాయతనం, కలియుగ దత్తావతారులు గురుపరంపర శ్రీ వేదవ్యాస మహర్షి, శ్రీ దక్షిణామూర్తి, శ్రీ ఆదిశంకరులు, శ్రీ గజానన మహారాజ్, శ్రీ వాసుదేవానంద సరస్వతి, శ్రీ సాయినాథులు, శ్రీ కృష్ణతులసి, శ్రీ సమర్థ రామదాసు, శ్రీధర మహారాజ్ గురుపరంపర సహిత, ఆది వృక్షాల పంచవటి, శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయం గూడూరు నందు ప్రథమ వార్షికోత్సవ వేడుకలు నభూతో నా భవిష్యతి అనే విధంగా జరగనున్నాయి. అందులో భాగంగానే ఈనెల 23, 24 తేదీ లల్లో రెండు రోజుల పాటు శ్రీ గురు పీఠం ప్రథమ వార్షికోత్సవం జరుగును. సమస్త భక్త జనాలు అధిక సంఖ్యలో విచ్చేసి ధన, వస్తు, రూపేనా సహకరించి 'శ్రీ గురు' కృపను పొందగలరని శ్రీ గురుపీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జిన్నారం పెద్దగొని శివకుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మాట్లాడుతూ శ్రీ గురు పీఠం ప్రథమ వార్షికోత్సవ వేడుకలకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. ఈ మేరకు కార్యక్రమాల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఈ నెల 23 మంగళవారం రోజున ఉదయం 9:00 గంటలకు కార్యక్రమ సంకల్పం మహా గణపతి పూజ, పుణ్యాహవాచనం, రుత్వికవరణం, పంచగవ్య ప్రాశన, నవగ్రహ, వాస్తు మండప ప్రతిష్ఠ, ప్రధాన దేవతా మండప, సర్వతో భద్ర మండప స్థాపన పూజా కార్యక్రమములు మధ్యాహ్నం 3:00 గంటలకు నవగ్రహ, వాస్తు, మండప దత్తాత్రేయ, సాయిబాబా మూలమంత్ర హోమము, సర్వతో భద్ర మండప హోమములు, సాయంత్రం 6:00 గంటలకు ప్రదోష మహా పూజ, విశేష హారతి మంత్ర పుష్పము భక్తులకు తీర్థ ప్రసాద వితరణ, అలాగే ఈ నెల 24 బుధవారం ఉదయం 8:00 గంటలకు మూల దేవతా మూర్తులకు విశేష ఫల పంచామృత అభిషేకం, గంగా, గోదావరి జలాలతో అష్టోత్తర శతఘటాభిషేకము, విశేష వేద సూక్తములతో మహా అభిషేకం పూజ, ఆ తర్వాత ఉదయం 9:00 గంటలకు సాయిదర్బార్, నాగారం వారిచే భజన కార్యక్రమం మధ్యాహ్నం 12:30 గంటలకు హిమాలయ సంత్ పరమహంస శ్రీశ్రీ వేదానంద సరస్వతి స్వామీజీ కరకమలములతో మహా పూర్ణాహుతి, విశేష హారతి మంత్రపుష్పము, భక్తులకు తీర్థ ప్రసాద జరుగుతాయన్నారు.